RNI NO : TELTEL/2023/89146

Telugu Daily

# శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగుదినపత్రిక | సంపుటి :3 | సంచిక:193 | గురువారం | 12 ఆగస్టు 2026 | పేజీలు :8 | వెల రూ.5

Published from : Karimnagar Circulated to : Adilabad, Warangal, Hyderabad, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy

రిపోర్టర్లు కావలెను




జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి

శెనార్తి మీడియా

ఆహ్వానం పలుకుతుంది

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలో సంప్రదించగలరు.

77309 83966 98491 98098



## రేవంత్ సోదరుల భూకుంభకోణం నిజం

- మేం టి హబ్ తెస్తే వారు అనుముల హబ్స్ దోపిడీ
- మరోసారి మాజీ మంత్రి కేటీఆర్ విమర్శలు

2



## బీఆర్ఎస్ నిలదీస్తే గానీ సోయి రాదా

- ఏపీ ప్రభుత్వ అజెండాపై ఎందుకు నోరు మెదపలేదు?
- బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు

2



# ఫిరాయింపు ఎమ్మెల్యేల్లో అసంతృప్తి

- మళ్లీ గులాబీ గూటివైపు చూపులు?
- అభివృద్ధి పనులు, నిధులపై ఆశించిన స్థాయిలో ఫలితం లేదన్న అసంతృప్తి
- పోచారం వ్యాఖ్యలతో కాంగ్రెస్‌లో చర్చ.. మరికొందరి పైనా ఊహాగానాలు
- ఫిరాయింపు ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ అధిష్టానం అప్రమత్తం

**హైదరాబాద్, ఆగస్టు 12:**

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీలో చేరిన తర్వాత నియోజకవర్గాలకు భారీగా నిధులు వస్తాయని, పెండింగ్ సమస్యలు పరిష్కారమవుతాయని ఆశించిన కొందరు ఎమ్మెల్యేలకు ఆశించిన స్థాయిలో ఫలితాలు కనిపించకపోవడంతో అసంతృప్తి పెరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో మరికొందరు తిరిగి బీఆర్ఎస్ వైపు వెళ్లే ఆలోచనలో ఉన్నారన్న ఊహాగానాలు రాజకీయ వర్గాల్లో ఊపందుకున్నాయి.

**పోచారం వ్యాఖ్యలతో కలకలం**

బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ చర్చకు మరింత బలం చేకూర్చాయి. కామారెడ్డి జిల్లా బీర్కూరులో కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాట్లాడిన ఆయన.. మంత్రి పదవి లేదా డబ్బు కోసం కాంగ్రెస్‌లో చేరలేదని, నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీ

మిగతా 2వ పేజీలో..

## గోదావరి జలాలను గరిష్టంగా వినియోగించాలి: సీఎం రేవంత్ రెడ్డి

- ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి సాధ్యమైనంత మేర ఎత్తిపోతలు
- పెండింగ్ పరిహారాలు వెంటనే చెల్లించాలని అధికారులకు ఆదేశం
- గట్టు, గూడెందొడ్డి ఎత్తిపోతల సామర్థ్యం పెంపుపై సమగ్ర అధ్యయనం
- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లపై ఎన్డీఎస్ఏ సూచనలు పాటించాలని స్పష్టం



**హైదరాబాద్, ఆగస్టు 12**

గోదావరి జలాలను గరిష్ట స్థాయిలో వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎల్లంపల్లితో పాటు దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి సాధ్యమైనంత మేర నీటిని ఎత్తిపోసి సాగు అవసరాలకు వినియోగించాలని

మిగతా 3వ పేజీలో..



3

## మిల్లర్ల నుండి బకాయిలు వసూలు చేయాల్సిందే

- సివిల్ సప్లయిస్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష

## ఆర్మీ రిక్రూట్‌మెంట్ కోసం శిక్షణ ఇవ్వాలి

- శిక్షణ ఇవ్వడానికి సిద్ధం : లెఫ్టినెంట్ జనరల్ వెల్లడి

3



## ఇందిరమ్మ టవర్స్‌కు నేడు శ్రీకారం

- కూకట్‌పల్లిలో శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి
- ఏడాదిలో గృహ ప్రవేశాలు జరిగేలా ప్రణాళిక
- తొలి విడతలో 16 నియోజకవర్గాల్లో 8 వేల ఇళ్ల నిర్మాణం
- గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి

3



## కాంగ్రెస్ వి హత్యా రాజకీయాలు

వెంకటేశం కుటుంబానికి న్యాయం జరిగేదాకా అండగా ఉంటాం

కుటుంబాన్ని పరామర్శించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాత దర్యాప్తు చేయాలి

2

## కొత్త ఫ్యామిలీ సర్టిఫికెట్లకు ఈసీ నో

- ఓటరు జాబితా సవరణలో ఆమోదించబోమని స్పష్టీకరణ
- జీఓ 172 ప్రకారం మీసేవ ద్వారా జారీ చేసిన వాటికి అనుమతి లేదని వెల్లడి
- పాత విధానంలో తహశీల్దార్ విచారణతో పొందిన సర్టిఫికెట్లకు మాత్రం అంగీకారం

2




4



## జంతర్‌మంతర్ సీజన్2కు సిద్ధం

- త్వరలోనే కొత్త పోరాటం ప్రారంభిస్తాం: అభిజీత్ దీప్కే
- నిరసనల తేదీలు, డిమాండ్లను త్వరలో వెల్లడిస్తామని ప్రకటన
- యువతకు అండగా కొనసాగుతామని స్పష్టీకరణ

## రైతు సంక్షేమమే మా ప్రాధాన్యత

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల
- తుమ్మలతో బిహార్ వ్యవసాయ మంత్రి విజయ్‌కుమార్ భేటీ
- ఆయిల్‌పామ్‌పై బిహార్.. మఖానాపై తెలంగాణ ఆసక్తి

3



2

## నీటి వాటాలపై రాజీపడే ప్రసక్తి లేదు

- వాటాల్లో బీఆర్ఎస్ వల్లే తెలంగాణకు నష్టం
- అసత్యాలను ప్రచారం చేయడం అలవాటు చేసుకున్న కేటీఆర్
- మీడియా సమావేశంలో మండిపడ్డ మంత్రి శ్రీధర్ బాబు

## 11.56 లక్షల ఇళ్లు కేటాయించండి

- కేంద్ర మంత్రి చౌహాన్‌కు మంత్రి పొంగులేటి వినతి
- తెలంగాణలో పర్యటించాల్సిందిగా ఆహ్వానం
- సానుకూలంగా స్పందించిన శివరాజ్ సింగ్

4

## కోదండరాంకు నిరుద్యోగుల నిరసన సెగ

2

- ఉద్యోగాల వయోపరిమితిపై నిలదీసిన యువత
- '60 ఏళ్లకు ఎమ్మెల్సీ..
- 30 ఏళ్లకు ఉద్యోగం వద్దా?'
- తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని డిమాండ్





# హర్ ఘర్ తిరంగాతో ఉప్పొంగుతున్న దేశ భక్తి

- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు**

**హైదరాబాద్, ఆగస్టు 12 :**

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు పూర్తవుతున్న శుభసందర్భాన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా 'హర్ ఘర్ తిరంగా' వేడుకలను నిర్వహించుకుంటున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు స్పష్టం చేశారు. పాత బస్తీలోని భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం నుంచి ప్రారంభమైన తిరంగా యాత్రలో యువత, ప్రజలు అశేష సంఖ్యలో పాల్గొని దేశభక్తిని చాటుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై కుటుంబ సమేతంగా మువ్వన్నెల జాతీయ జెండాను గర్వంగా, ఉత్సాహంగా ఎగురవేయాలని, తిరంగా యాత్రలో పాల్గొనాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. స్వాతంత్ర్య సమరయోధులు, సరిహద్దుల్లో ప్రాణాలర్పించిన వీర జవాన్ల అమూల్యమైన త్యాగాల పునాదులపైనే నేటి సగర్వ భారత్ నిర్మాణం జరిగిందని రామచందర్ రావు పేర్కొన్నారు. వికసిత్ భారత్ స్వప్నాన్ని సాకారం చేసుకునే దిశగా ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈనెల 14న ట్యాంక్ బండ్‌పై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి స్వామి వివేకానంద విగ్రహం వరకు నిర్వహించనున్న తిరంగా యాత్రను పవిత్రమైన దేశభక్తి కార్యక్రమలో రాజకీయాలకు అతీతంగా ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.

# ఎంఎస్ఎంఈ రంగాలు పురోగమించాలి

- **అప్పుడే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం**
- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు**



**హైదరాబాద్, ఆగస్టు 12 :**

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటినుండి నేటివరకు భారత్ ఎంతో ప్రగతి సాధించిందని, ముఖ్యంగా డిజిటల్ ఇండియా, సాంకేతిక అభివృద్ధి, పెట్టుబడుల సాధనలో దేశం మైలురాళ్లను అధిగమించిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎన్.రామచందర్ రావు గుర్తుచేశారు. ఎస్‌వీపీ ఆధ్వర్యంలో బుధవారం ఇక్కడ నిర్వహించిన సైన్స్ ఫండ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. సైన్స్, శాస్త్రీయ ఆవిష్కరణల రంగానికి కూడా తగిన ఆర్థిక సహాయం అందించడం చాలా అవసరమని పేర్కొన్నారు. భారత దేశం అనేక రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా తనదైన ముద్ర వేసిందని, సైన్స్ రంగానికి కేవలం ప్రభుత్వం నుంచే కాక ప్రైవేట్ భాగస్వాముల నుంచి కూడా ఫండింగ్ పెరిగినప్పుడే నూతన ఆవిష్కరణలు, ఎంఎస్ఎంఈ రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని, తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ మరింత దృఢపడుతుందని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలవడం ప్రతి ఒక్కరికీ గర్వకారణమని రామచందర్ రావు అన్నారు. ఇటీవల ప్రారంభించిన య□పీఐ విధానం ద్వారా నేడు ప్రపంచవ్యాప్తంగా జరిగే మొత్తం డిజిటల్ లావాదేవీలలో ఒక్క భారతదేశానిదే 40 శాతం వాటా ఉండటం మన సాంకేతిక రంగానికి నిదర్శనమని చెప్పారు. ఇటువంటి తరుణంలో ఎస్‌వీపీ వంటి సంస్థలు ముందుకు వచ్చి నూతన ఆవిష్కర్తలకు, స్టార్టప్‌లకు ఫండింగ్ అందించి ప్రోత్సహించడం అభినందనీయమని, ఇది దేశానికి మరింత ఉజ్జ్వలమైన ఆర్థిక భవిష్యత్తును అందిస్తుందని ఆకాంక్షిస్తూ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# కొత్త ఫ్యామిలీ సర్టిఫికెట్లకు ఈసీ నో

**హైదరాబాద్, ఆగస్టు 12:**

తెలంగాణలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియలో కొత్తగా జారీ చేస్తున్న ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ల చెల్లుబాటుపై కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) స్పష్టత ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం జులై 25న జారీ చేసిన జీఓ 172 ప్రకారం మీసేవ ద్వారా జారీ చేసే ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్లను ఓటరు నమోదు, పరిశీలన ప్రక్రియలో గుర్తించలేమని తెలిపింది. ఈ మేరకు ఈసీఐ కార్యదర్శి నవీన్ కుమార్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి లేఖ రాశారు.

**రేషన్ కార్డుతో సమానంగా..**

గతంలో తహశీల్దార్లు క్షేత్రస్థాయిలో విచారణ చేసి, సంబంధిత పత్రాలను పరిశీలించిన తర్వాత ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లను జారీ చేసేవారని ఈసీఐ పేర్కొంది. అయితే జీఓ 172 ప్రకారం ముందస్తు విచారణ లేకుండానే రేషన్ కార్డు వివరాల ఆధారంగా మీసేవ ద్వారా రెండు రోజుల్లో సర్టిఫికెట్లు జారీ అవుతున్నాయని తెలిపింది. ఈ నేపథ్యంలో కొత్త సర్టిఫికెట్లను రేషన్ కార్డులతో సమానంగా పరిగణించాల్సి ఉంటుందని వివరించింది.

**పాత సర్టిఫికెట్లకు అంగీకారం**

రేషన్ కార్డు పౌరసత్వానికి నిశ్చయాత్మక ఆధారం కాదని, ఓటరు జాబితా పరిశీలనలో దానిని ప్రామాణిక పత్రంగా పరిగణించలేమని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఈసీఐ ప్రస్తావించింది. అందువల్ల జీఓ 172 కింద జారీ చేసే కొత్త ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్లను గుర్తింపు పత్రాలుగా స్వీకరించబోమని స్పష్టం చేసింది. అయితే జీఓ 172 అమల్లోకి రాకముందు, అంటే జులై 25, 2026కు ముందు తహశీల్దార్ క్షేత్రస్థాయి విచారణ అనంతరం పాత విధానంలో జారీ చేసిన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లను మాత్రం SIR పరిశీలనలో ఆమోదిస్తామని ఈసీఐ వెల్లడించింది.

# కోదండరాంకు నిరుద్యోగుల నిరసన సెగ

- **ఉద్యోగాల వయోపరిమితిపై నిలదీసిన యువత**
- **'60 ఏళ్లకు ఎమ్మెల్సీ.. 30 ఏళ్లకు ఉద్యోగం వద్దా?'**

**హైదరాబాద్, ఆగస్టు 12:**

ఎమ్మెల్సీ, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంకు నిరుద్యోగ యువత నుంచి నిరసన సెగ తగిలింది. హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రభుత్వ ఉద్యోగాల వయోపరిమితి పెంపుపై మాట్లాడేందుకు వచ్చిన ఆయనను నిరుద్యోగులు అడ్డుకుని నిలదీశారు. పెద్ద సంఖ్యలో యువత చుట్టుముట్టడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

**వయోపరిమితిపై ప్రశ్నలు**

'మీరు 60 ఏళ్ల వయసులోనూ సుప్రీంకోర్టు వరకు వెళ్లి ఎమ్మెల్సీ పదవి పొందగలిగారు. మాకు 30 ఏళ్లకే ఉద్యోగం చేసే అర్హత లేకుండా పోయిందా?' అంటూ నిరుద్యోగులు కోదండరాంను ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నమ్మి కాంగ్రెస్‌కు ఓటు వేశామని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగాల వయోపరిమితి, నోటిఫికేషన్ల అంశాలపై ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు.

**సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని డిమాండ్**

ఏళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ మానసికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు.

# ఫిరాయింపు ఎమ్మెల్యేల్లో అసంతృప్తి

**మొదటిపేజీ తరువాయి**

మారానని చెప్పారు. అయితే తాను ఆశించిన స్థాయిలో అభివృద్ధి పనులు జరగడం లేదన్న అసంతృప్తిని వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరే సమయంలో బాన్సువాడ నియోజకవర్గంలోని పెండింగ్ సమస్యలను ఆరు నెలల్లో పరిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని పోచారం గుర్తు చేసినట్లు సమాచారం. మంత్రులు, ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులను సంప్రదించినా స్పందన ఆశించిన స్థాయిలో లేదని ఆయన చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో అంతర్గత చర్చకు దారితీశాయి.

**మరికొందరిపైనా చర్చ**

పోచారం శ్రీనివాసరెడ్డితో పాటు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పేరు కూడా రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. వీరి తర్వాత మరికొందరు కూడా బీఆర్ఎస్ వైపు తిరిగి వెళ్లే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో సంప్రదింపులు జరుగుతున్నట్లు ఊహాగానాలు ఉన్నప్పటికీ.. దీనిపై ఎలాంటి అధికారిక ధ్రువీకరణ లేదు.

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కూడా కొంతకాలంగా కాంగ్రెస్‌కు దూరంగా ఉంటున్నట్లు కనిపించడం చర్చకు దారితీసింది. మున్సిపల్ ఎన్నికల సమయంలో ఆయన సోదరుడు బీఆర్ఎస్‌లో చేరి ఆ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా పనిచేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

**అభివృద్ధి పనులపై ఒత్తిడి**

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి కూడా నియోజకవర్గ అభివృద్ధి పనుల విషయంలో ఒత్తిడి ఎదుర్కొంటున్నట్లు స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు రోడ్లు, నీటిపారుదల, ఇతర కీలక పనులు ముందుకు సాగాలని అనుచరులు కోరుతున్నట్లు తెలుస్తోంది. అధికార పార్టీలో చేరిన తర్వాత అభివృద్ధి పనులు వేగంగా జరుగుతాయని భావించినా.. కొన్ని నియోజకవర్గాల్లో నిధుల విడుదల, పనుల పురోగతిలో జాప్యం ఎమ్మెల్యేలకు ఇబ్బందిగా మారిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనికి తోడు స్థానిక కాంగ్రెస్ నాయకత్వంతో సమన్వయం కూడా కొందరికి సవాలుగా మారిందని సమాచారం.

**కాంగ్రెస్‌లో అప్రమత్తత**

ఫిరాయింపు ఎమ్మెల్యేల నుంచి వరుసగా అసంతృప్తి వ్యక్తమవుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ నాయకత్వం అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ కూడా పరిస్థితిపై ఆరా తీసినట్లు సమాచారం. పోచారం వ్యాఖ్యలపై పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ స్పందిస్తూ.. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న వనరులతో హామీల అమలుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

**గులాబీ గూటికి తిరిగొస్తారా?**

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలలో కొందరు తమ నిర్ణయాన్ని పునఃపరిశీలిస్తున్నారన్న ప్రచారం తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తిని పెంచుతోంది. పార్టీ మారిన సమయంలో నియోజకవర్గ అభివృద్ధి, రాజకీయ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకున్నా.. ఆశించిన ఫలితాలు అందకపోవడంతో కొందరిలో అసంతృప్తి పెరిగిందన్న చర్చ జరుగుతోంది. పోచారం బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేయడం, గూడెం మహిపాల్‌రెడ్డి వ్యవహారశైలి, దానం నాగేందర్ బీఆర్ఎస్ నాయకత్వంపై చేసిన సానుకూల వ్యాఖ్యలు, మరి కొందరు ఎమ్మెల్యేలు నియోజకవర్గ సమస్యలపై ఎదుర్కొంటున్న ఒత్తిడి.. ఇవన్నీ ఫిరాయింపు ఎమ్మెల్యేల తదుపరి రాజకీయ అడుగులపై ఆసక్తిని పెంచుతున్నాయి. అయితే వీరిలో నిజంగా ఎంతమంది తిరిగి బీఆర్ఎస్‌లోకి వెళ్తారన్నది ఇప్పటికీ స్పష్టత లేని అంశమే. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకత్వం అసంతృప్తిని చల్లార్చి ఎమ్మెల్యేలను పార్టీలోనే కొనసాగించేలా ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది కీలకంగా మారింది. మొత్తంగా ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారం తెలంగాణ కాంగ్రెస్‌కు మరో రాజకీయ సవాల్‌గా మారుతోంది.

# గిరిజనుల నిధులు, భూములు గోల్‌మాల్

**సిద్దిపేట, ఆగస్టు 12 :**

గిరిజనుల సంక్షేమానికి కేటాయించిన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం సక్రమంగా ఖర్చు చేయడం లేదని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆరోపించారు. గిరిజన యువత ఉద్యోగాల కోసం వెతికే స్థాయి నుంచి పదిమందికి ఉద్యోగాలు కల్పించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. సిద్దిపేటలో ట్రైబల్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన గిరిజన పారిశ్రామికవేత్తల అవగాహన సదస్సు, సిద్దిపేట జిల్లా చాప్టర్ ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గిరిజన యువతకు వ్యాపార అవకాశాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలపై అవగాహన కల్పిస్తూ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. గిరిజన యువతకు మార్గదర్శకంగా నిలవడంతోపాటు వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ప్రెజర్ గ్రూప్‌గా కూడా పనిచేయాలని సూచించారు. నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో చదివిన రమేష్‌నాయక్ లండన్‌లో 16 హోటళ్లు స్థాపించి గొప్ప వ్యాపారవేత్తగా ఎదిగారని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో టీప్రైడ్ ద్వారా సహకారం పొందిన సురేష్‌నాయక్ హైదరాబాద్‌లో హార్లిక్స్ బర్త్‌డే కేకులు తయారు చేస్తూ పెద్ద కంపెనీలతో పోటీపడుతున్నారని ఉదాహరణలుగా పేర్కొన్నారు. ఇలాంటి విజయగాథల నుంచి గిరిజన యువత స్ఫూర్తి పొందాలన్నారు. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గిరిజన అభివృద్ధికి వందల కోట్ల సబ్సిడీలు అందించామని, గిరిజన మహిళల కోసం రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేశామని, అనేక గురుకులాలను నిర్మించి నాణ్యమైన విద్యను అందించామని చెప్పారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత గిరిజనులకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతానికి పెంచామని, దీంతో ఎంతోమంది గిరిజన యువత డాక్టర్లు, ఇంజనీర్లుగా ఎదిగారన్నారు. రాష్ట్రంలోని 3,300 తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి గిరిజన బిడ్డలను సర్పంచులుగా చేసి వారికి రాజ్యాధికారం అందించామని తెలిపారు. జనాభా ప్రాతిపదికన కేటాయించిన నిధులు ఆర్థిక సంవత్సరంలో ఖర్చు కాకపోతే మరుసటి ఏడాదికి క్యారీ ఫార్వర్డ్ అయ్యేలా ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని తీసుకొచ్చి అమలు చేశామని చెప్పారు. ఆరు లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇచ్చి గిరిజనులను రైతులుగా మార్చామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం గిరిజనులకు తీవ్ర ద్రోహం చేస్తోందని హరీశ్‌రావు విమర్శించారు. మేనిఫెస్టోలో పదో తరగతి పాస్ అయితే రూ.10వేలు, పీజీ చేస్తే రూ.2 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చినా అమలు చేయలేదన్నారు. అసెంబ్లీలో తాము ప్రశ్నించినప్పుడు ఎస్టీ కార్పొరేషన్‌కు రూ.2,730 కోట్లు కేటాయించామని ప్రభుత్వం చెప్పిందని, అయితే ఖర్చు చేసింది రూ.70 కోట్లు మాత్రమేనని తెలిపారు. ఒక్క గిరిజన బిడ్డకు కూడా ఉపాధి కల్పించలేదని విమర్శించారు. ఎస్టీ ఎస్డీఎఫ్ నిధులను బడ్జెట్‌లో కేటాయిస్తున్నా వాటిలో సగం కూడా ఖర్చు చేయడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ భూములకు పట్టాలు ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం లక్ష ఎకరాల అసైన్డ్ భూములను గుంజుకుని పేదలను రోడ్డున పడేసిందని హరీశ్‌రావు ఆరోపించారు. గిరిజనుల భూములను లాక్కుని ముఖ్యమంత్రి సోదరుడు కొండల్‌రెడ్డి, అల్లుడు సత్యకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. గిరిజన యువతకు అన్యాయం జరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో టీఐసిసిఐ మరింత చురుగ్గా పని చేయాలని హరీశ్‌రావు కోరారు. ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న సబ్సిడీలను రాబట్టేందుకు కృషి చేయాలని సూచించారు. జిల్లాలోని ఎస్టీ యువత టీఐసిసిఐ సేవలను సద్వినియోగం చేసుకుని సభ్యులుగా చేరాలని, నైపుణ్యాలను పెంచుకుని ఉద్యోగాలు కల్పించే స్థాయిలో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని హరీశ్‌రావు సూచించారు.

## రేవంత్ సోదరుల భూకుంభకోణం నిజం

**హైదరాబాద్, ఆగస్ట్12:**

ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సోదరులు భూకుంభకోణాలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్కిం గ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణలు గుప్పించారు. 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ ఇన్నోవేటర్ ఆఫ్ ది సెంచరీ'గా అనుముల కొండల్ రెడ్డిని ప్రకటించాలని ఎద్దేవా చేశారు. నిజమైన స్టార్టప్లు ఎదగాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి దక్కాలని తాము కష్టపడి టి హబ్'ను నిర్మిస్తే సీఎం రేవంత్ రెడ్డి మాత్రం తన కుటుంబ ప్రయోజనాల కోసం 'అనుముల హబ్స్' ఏర్పాటు చేయడంలో బిజీగా ఉన్నారని విమర్శించారు. ఇది ఫ్యామిలీరన్.. ఫ్యామిలీడ్రైవ్.. జీరో ఇన్నోవేషన్.. జీరో ఎంప్లాయీస్ స్కామ్ అంటూ ఆరోపించారు. అనుముల సోదరుల్లో ఒకరైతే చాలు.. ఎటువంటి ప్రశ్నలు లేకుండా వందల కోట్లు విలువైన భూములు దక్కించుకో వచ్చంటూ సెటైర్ విసిరారు. 'సున్నా పెట్టుబడితో టెస్సరాక్ట్ అడ్వాన్స్డ్ సిస్టమ్ అనే డిఫె న్స్ కంపెనీ పెట్టి, రాత్రికి రాత్రే కనీసం రూ. 200 కోట్ల లాభం ఆర్జించినందుకు 'ఇన్నో వేటర్ ఆఫ్ ది సెంచరీ'గా అనుముల కొండల్ రెడ్డిని ప్రకటించాల్సిందే. శ్రీధర్ బాబు, రేవంత్ రెడ్డి.. తెలంగాణలోని లక్షలాది మంది నిరుద్యోగ యువతకు కూడా ఈ అద్భుతమైన 'బిజినెస్ మోడల్' ఏంటో నేర్పించండి. వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ఇంత చౌకగా ఎలా పొందాలో శిక్షణ ఇవ్వండి. ఈ మ్యాజిక్ ట్రిక్ కేవలం అనుముల కుటుంబానికే ఎందుకు పరిమితం కావాలి? తెలంగాణ యువత మొత్తానికి ఈ 'అనుములు హబ్' అవకాశాన్ని కల్పించండి' అంటూ కేటీఆర్ సెటైరికల్ కామెంట్స్ చేశారు.

## నీటి వాటాలపై రాజీపడే ప్రసక్తి లేదు

**హైదరాబాద్, ఆగస్టు 12 :**

తెలంగాణ నీటి వాటా విషయంలో ఎక్కడా రాజీపడబోమని పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. నీటి వాటాల్లో తెలంగాణకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నష్టం చేసిందని విమర్శించారు. గాంధీ భవన్‌లో బుధవారం మంత్రులతో ముఖాముఖి కార్యక్రమం అనంతరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీఆర్ఎంబీ సమావేశానికి హాజరవుతామని, నీటి వాటాపై బలంగా కొట్లాడతామని తేల్చి చెప్పారు. అసత్యాలతో ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారంటూ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై మండిపడ్డారు. కేసీఆర్ ఫాం హౌస్‌లో పండిన వరికి వచ్చిన ధర ఎంతో చెప్పాలంటూ ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. తాము రూ.కోటిన్నరకు ఇచ్చిన భూమిని బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 90 లక్షలకే ఇచ్చిందని గుర్తు చేశారు. నిబంధనల మేరకే భూ కేటాయింపులు జరిగాయని ఆయన వివరించారు. అయిదెకరాల భూమిని రూ.7.5 కోట్లకు ఇచ్చామని చెప్పారు. కేటీఆర్ చెబుతున్న రూ.200కోట్లు ఎక్కడివో చెప్పాలని నిలదీశారు. హిల్ట్ పాలసీ వల్ల హైదరాబాద్ ప్రజలకు మేలు జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పారిశ్రామికవేత్తలను కేటీఆర్ భయపెట్టడం మంచిది కాదన్నారు. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడం సరైనది కాదని హితవు పలికారు. భూ కేటాయింపులపై కేటీఆర్ ఆరోపణలకు మంత్రి శ్రీధర్‌బాబు స్పందించారు. జీఆర్ఎంబీ సమావేశానికి హాజరై తెలంగాణకు రావాల్సిన నీటి వాటాల కోసం బలంగా వాదిస్తామని శ్రీధర్‌బాబు పునరుద్ఘాటించారు. తమపై ఉన్న కోపాన్ని రాష్ట్ర ప్రజలపై చూపవద్దని కేటీఆర్‌కు సూచించారు.

# కాంగ్రెస్ వి హత్యా రాజకీయాలు

**సిరిసిల్ల ఆగస్టు 12 :**

పట్టణంలోని బీవై నగర్‌కు చెందిన నేత కార్మికుడు వెంగళ వెంకటేశం కుటుంబాన్ని బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ బుధవారం పరామర్శించారు. వెంకటేశం మృతిపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన కేటీఆర్ ఆయన భార్య, తల్లి, కుమార్తెను ఓదార్చి న్యాయం జరిగేదాకా ఆ కుటుంబం వెంటే ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటేశం మృతికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర దర్యాప్తు జరిపి ఘటనకు అసలు కారణాలు, బాధ్యులు, సూత్రధారులు ఎవరైనా వారిని వెలుగులోకి తీసుకురావాలని పోలీసులను డిమాండ్ చేశారు. కాంగ్రెస్ హత్యా రాజకీయాలు చేస్తున్నదని విమర్శించారు. తమపై రాజకీయ విమర్శలు చేయవచ్చని, కేసులు పెట్టవచ్చని, కానీ సామాన్య ప్రజలను రాజకీయాలకు బలిపశువులుగా మార్చడం సమర్థనీయం కాదన్నారు. వెంకటేశం కుటుంబ పరిస్థితిని చూసి తీవ్ర భావోద్వేగానికి గురైన కేటీఆర్ ఆయన చిన్నారి కుమార్తె తన తండ్రి కోసం ఎదురు చూస్తూ మూడు రోజులుగా తినలేదని చెప్పడం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. మనసున్న ఏ మనిషికైనా కన్నీళ్లు రాక మానవు.. గుండె ద్రవించక మానదు అని కేటీఆర్ అన్నారు.

అసలు సూత్రధారులను గుర్తించాలి

వెంకటేశం మృతి ఘటనలో కాంగ్రెస్ నాయకులు కొందరిని పోలీసులు అరెస్టు చేసినప్పటికీ వారు పాత్రధారులు మాత్రమేనని, అసలు సూత్రధారులు ఎవరన్నది తేల్చాల్సిన అవసరం ఉందని కేటీఆర్ అన్నారు. ఐదుగురిని అరెస్టు చేసినట్లు చెబుతున్నప్పటికీ వారిలో ఇద్దరిని రిమాండ్‌కు పంపి మిగతా ముగ్గురికి స్టేషన్ బెయిల్ ఇవ్వడంపై కూడా కేటీఆర్ ప్రశ్నలు లేవనెత్తారు. పోలీసుల రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్త ఇల్లు మంజూరు చేయాలని తాము కాంగ్రెస్ నాయకులను ఆశ్రయించినప్పటికీ నెలలతరబడి తిప్పించుకున్నారని కుటుంబీకులు తన దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. ఈ విషయంపై ఇప్పటికే కలెక్టర్‌తో మాట్లాడానని, కుటుంబానికి ఇల్లు మంజూరు చేయండి.. ఒకవేళ ప్రభుత్వం ఇవ్వలేని పరిస్థితి ఉంటే బీఆరఎస్ పార్టీ తరఫున నిర్మించి ఇస్తాం.. మీరు మా ప్రయత్నానికి అడ్డుగా ఉండొద్దని కలెక్టర్‌కు చెప్పాను' అని కేటీఆర్ తెలిపారు.

**కుమార్తె భవిష్యత్ బాధ్యత నాదే**

తాను ఎమ్మెల్యేగా మాత్రమే కాక ఆ కుటుంబానికి మాట ఇచ్చిన సోదరుడిగా బాధ్యత తీసుకుంటున్నానని కేటీఆర్ అన్నారు. వెంకటేశం కుమార్తె ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్నదని, ఆ బాలిక పేరుపై రూ.3 లక్షలు డిపాజిట్ చేసినట్లు, ఆమె మేజర్ అయ్యాక ఆ మొత్తం అందుబాటులోకి వచ్చేలా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆమె చదువుతున్న పాఠశాలతో మాట్లాడి పదో తరగతి వరకు బాలిక ఫీజులు తదితర ఖర్చుల విషయంలో తాను వ్యక్తిగతంగా బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చానన్నారు. పదో తరగతి తర్వాత ఏం చదవాలనుకున్నా ఆమె చదువు కొనసాగించే బాధ్యత కూడా తీసుకుంటానని హామీ ఇచ్చారు. కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం కూడా పార్టీ తరఫున అందించామన్నారు.వెంకటేశం మృతిని ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం జరిగిందన్న ఆరోపణలను కూడా కేటీఆర్ ప్రస్తావిస్తూ సమగ్ర దర్యాప్తు జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు. స్థానిక కాంగ్రెస్ నాయకత్వంపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు.

# బీఆర్ఎస్ నిలదీస్తే గానీ సోయి రాదా

**హైదరాబాద్, ఆగస్టు 12 :**

తెలంగాణ ప్రాజెక్టులపై సమీక్షించాలని ఏపీ ప్రభుత్వం జీఆర్ఎంబీ సమావేశంలో ప్రస్తావించనుండడంపై బీఆరఎస్ ప్రశ్నించిన తర్వాత హడావుడిగా లేఖలు రాయడం తప్ప రాష్ట్ర ప్రయోజనాల పట్ల మీకు చిత్తశుద్ధి లేదా అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు నిలదీశారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు మీ నామమాత్రపు లేఖలు రాష్ట్ర ప్రాజెక్టులను కాపాడతాయా అని ఒక ప్రకటనలో ప్రశ్నించారు. లేఖలతో పనులు కావు.. తెలంగాణ నీటి ప్రయోజనాల కోసం రాజీ లేని పోరాటం చేయాలి అని హితవు పలికారు. ఏపీ ప్రభుత్వం జీఆర్ఎంబీ అజెండాలో పెట్టిన అంశాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వాటిని అజెండా నుంచి తొలగించే వరకు తెలంగాణ ప్రభుత్వం పట్టుబట్టాలని, ఆ అంశాలను వెనక్కి తీసుకోకపోతే అవసరమైతే జీఆరఎంబీ సమావేశానికి హాజరు కాబోమని కరాఖండిగా తేల్చి చెప్పాలి అని అన్నారు. అలాకాకుండా మీ రాజకీయ అవసరాల కోసం సమావేశానికి వెళ్లి అక్కడ తెలంగాణ ప్రాజెక్టులపై ఏపీ పెట్టిన అభ్యంతరాలకు బలం చేకూర్చేలా వ్యవహరిస్తే మాత్రం బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదు అని హరీష్‌రావు హెచ్చరించారు. రేవంత్ రెడ్డీ.. ఇది రాజకీయాలకు సంబంధించిన విషయం కాదు.. తెలంగాణ భవిష్యత్తుకు సంబంధించిన విషయం.. తెలంగాణ నీటి హక్కులకు సంబంధించిన విషయం అని చెప్పారు. ప్రతిపక్షాలపై పిచ్చి ప్రేలాపనలు చేసే రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రాజెక్టులపై ఏపీ అభ్యంతరాలు చెబితే ఎందుకు నోరు మెదపడం లేదన్నారు. ఈ నెల 18న హైదరాబాద్‌లో జరిగే జీఆర్ఎంబీ సమావేశం అజెండాను ఉపసంహరించుకోకుండా నిర్వహిస్తే తెలంగాణ ప్రాజెక్టులను కాపాడుకునేందుకు బీఆరఎస్ పార్టీ వేలాదిమందితో జీఆరఎంబీ కార్యాలయాన్ని ముట్టడిస్తుందని హెచ్చరించారు. కేంద్రం చేతిలోని జీఆర్ఎంబీ, చంద్రబాబు, రేవంత్ కలిసి తెలంగాణకు చేస్తున్న జల ద్రోహాన్ని అడ్డుకుంటామన్నారు.

# గోదావరి జలాలను గరిష్టంగా వినియోగించాలి: సీఎం రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి

సూచించారు. నీటిపారుదల శాఖపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు ఉన్నతాధికారులతో ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.

**దేవాదుల నుంచి 9 పంపులతో ఎత్తిపోతలు**

దేవాదుల ప్రాజెక్టు నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా తొమ్మిది పంపులతో ఎత్తిపోతలు చేపట్టినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమావేశంలో వివరించారు. దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి నీటిని ఎత్తిపోసే క్రమంలో ఎదురవుతున్న చిన్నపాటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఎం సూచించారు.

**పెండింగ్ పరిహారాలపై దృష్టి**

పలు ప్రాజెక్టుల కింద ఒకట్రెండు గ్రామాలు, కొద్దిపాటి వ్యవసాయ భూములకు పరిహారం చెల్లింపులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు సీఎంకు వివరించారు. తక్షణ ప్రభావం పడే గ్రామాలకు వెంటనే పరిహారం చెల్లించేలా కార్యాచరణ రూపొందించాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. నీటిపారుదల, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ముంపు గ్రామాలు, పరిహారం, పునరావాసంపై వాస్తవ పరిస్థితులతో నివేదిక రూపొందించాలని సూచించారు.

**బస్వాపూర్, గౌరవెల్లిలో నీటి నిల్వకు చర్యలు**

పెండింగ్ పరిహారాల చెల్లింపులు పూర్తయితే బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టుల్లో నీటిని నింపే అవకాశం ఉంటుందని సీఎం తెలిపారు. ఇందుకు అవసరమైన పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**ఎత్తిపోతల సామర్థ్యంపై అధ్యయనం**

గట్టు, గూడెందొడ్డి ఎత్తిపోతల సామర్థ్యాన్ని పెంచే అంశంపై సమగ్ర అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. గూడెందొడ్డి పంప్‌డ్‌స్టోరేజీ ప్రాజెక్టుకు సంబంధించి కన్సల్టెంట్‌ను నియమించాలని ఆదేశించారు.

**బ్యారేజీలపై ఎన్డీఎస్ఏ సూచనలు పాటించాలి**

జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయడం లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మేడిగడ్డతో పాటు సుందిళ్ల బ్యారేజీలోనూ పలు లోపాలు ఉన్నట్లు తేలిందని వివరించారు. ఈ అంశంపై ఎన్డీఎస్ఏతో సంప్రదింపులు జరిపి, సంస్థ సూచనలను తప్పనిసరిగా పాటించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

# 78 మంది ఖైదీలు ఎస్.ఎస్.సి ఉత్తీర్ణత

**హైదరాబాద్, ఆగస్టు 12:**

ఖైదీల విద్య, పునరావాసం మరియు సమాజంలో తిరిగి గౌరవప్రదంగా జీవించేలా చేయడంలో భాగంగా తెలంగాణ జైళ్ల శాఖ చేపడుతున్న నిరంతర కార్యక్రమాల్లో మరో కీలక ముందడుగు పడింది. ఖైదీలు తమ విద్యను కొనసాగించి ఎస్సెస్సీ పూర్తి చేసుకునే అవకాశం కల్పించేందుకు తెలంగాణ జైళ్ల శాఖ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐఓఎస్)తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. అనంతరం సెంట్రల్ ప్రిజన్, చర్లపల్లి, సెంట్రల్ ప్రిజన్, నిజామాబాద్, స్పెషల్ ప్రిజన్ ఫర్ ఉమెన్, హైదరాబాద్ నుంచి మొత్తం 108మంది ఖైదీలు 10వ తరగతిలో నమోదు చేసుకున్నారు. ఖైదీల చదువుకు అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వ ఉపాధ్యాయులను కేటాయించడంతో పాటు, అవసరమైన చోట అదనంగా ప్రైవేట్ ఉపాధ్యాయులను కూడా నియమించారు. వీరి వేతనాలను జైళ్ల శాఖ భరించింది. సంబంధిత జైళ్లలోని అధికారులు, ఉపాధ్యాయులు విద్యార్థుల చదువును నిరంతరం పర్యవేక్షిస్తూ, మార్గనిర్దేశం చేశారు. ఒక సంవత్సరంపాటు క్రమబద్ధమైన విద్యా ప్రణాళికలో భాగంగా రెగ్యులర్ తరగతులు, మాక్ టెస్టులు, ప్రీబోర్డ్ పరీక్షలు నిర్వహించి ఎన్ఐఓఎస్ ఎస్సెస్సీ పరీక్షలకు ఖైదీలను సిద్ధం చేశారు. ఈ నిరంతర కృషి ఫలితంగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో 78 మంది ఖైదీలు ఎస్సెస్సీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. సెంట్రల్ ప్రిజన్, చర్లపల్లి -56 మంది , సెంట్రల్ ప్రిజన్ నిజామాబాద్15 మంది, స్పెషల్ ప్రిజన్ ఫర్ ఉమెన్, హైదరాబాద్ - 7 మంది ఖైదీలకు సులభంగా అర్థమయ్యేలా, భవిష్యత్తులో ఉపాధి, జీవనోపాధికి ఉపయోగపడే విధంగా పాఠ్యాంశాలను ఎంపిక చేశారు. ఇందులో డేటా ఎంట్రీ ఆపరేటర్, నైపుణ్యాలకు సంబంధించిన అంశాలను కూడా చేర్చారు. తెలంగాణ జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ అండ్ ఏఎంపీ; కరెక్షనల్ సర్వీసెస్ డా. సౌమ్య మిశ్రా విజయవంతంగా ఎస్సెస్సీ ఉత్తీర్ణత సాధించిన ఖైదీలకు ధ్రువపత్రాలను అందజేసి అభినందించారు. ఈ ఫలితాలను వారి విద్యా ప్రయాణం, స్వీయాభివృద్ధి, పునరావాసంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా అభివర్ణించారు. ఖైదీలు చూపిన పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర శ్రమ, ఆత్మవిశ్వాసం మరియు ప్రతికూల పరిస్థితులను అధిగమించాలనే సంకల్పాన్ని డీజీ ప్రత్యేకంగా ప్రశంసించారు. తమ జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావాలనే దృఢ సంకల్పానికి ఈ విజయం నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. ఇదే పట్టుదలతో భవిష్యత్తులో కూడా విద్యను కొనసాగిస్తూ, తమకు, తమ కుటుంబాలకు గౌరవప్రదమైన, మెరుగైన భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు ఖైదీలు తమ అనుభవాలను పంచుకున్నారు. విద్య లేకపోవడం వల్ల తమ జీవితాల్లో ఎదురైన ఇబ్బందులను వారు వివరించారు. చదువు లేకపోవడం కారణంగా ఆత్మవిశ్వాసం తగ్గిపోయిందని, సమాజంలో తగిన గౌరవం లభించలేదని కొందరు తెలిపారు. ఒక ఖైదీ భవిష్యత్తులో ఎల్ ఎల్‌బీ వరకు చదివి న్యాయవాదిగా మారి, పేద ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందించాలనే తన సంకల్పాన్ని వ్యక్తం చేశారు. మరో ఖైదీ తన చిన్ననాటి నుంచే సరైన విద్య అందించి ఉంటే తన జీవితం మరోలా ఉండేదని, తాను జైలుకు వచ్చే పరిస్థితి ఏర్పడి ఉండకపోయేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలోని ఖైదీలకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావడంలో సహకరిస్తున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ ఐఓఎస్) కు కూడా సౌమ్య మిశ్రా కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా మాజీ ఎన్ ఐఓఎస్ రీజినల్ డైరెక్టర్ పరంప్రీత్ సింగ్, ఎన్ ఐఓఎస్ రీజినల్ డైరెక్టర్ డా. ప్రవీణ్ చౌహాన్ అందిస్తున్న నిరంతర సహకారాన్ని ఆమె అభినందించారు. విద్యపై ఖైదీలు చూపిన కష్టపడి పనిచేసే తత్వం, క్రమశిక్షణ మరియు నిబద్ధతకు గుర్తింపుగా, ఎన్ ఐఓఎస్ ద్వారా ఎస్సెస్సీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన ఖైదీలందరికీ డైరెక్టర్ జనరల్ రిమిషన్ ను ప్రత్యేక ప్రోత్సాహకంగా ప్రకటించారు. విద్య, స్వీయాభివృద్ధి, పునరావాసం దిశగా ముందుకు సాగుతున్న ఇతర ఖైదీలకు కూడా ఇది ప్రేరణగా నిలుస్తుందని ఆమె పేర్కొన్నారు. ఈ విజయంతో ప్రోత్సాహం పొందిన తెలంగాణ జైళ్ల శాఖ, ఎస్సెస్సీ ఉత్తీర్ణులైన ఖైదీలను ఎన్ ఐఓఎస్ ద్వారా సీనియర్ సెకండరీ (10+2) విద్యను కొనసాగించేలా ప్రోత్సహించనుంది. అదే సమయంలో మరో 47 మంది ఖైదీలు తాజాగా ఎస్సెస్సీ విద్యలో నమోదు చేసుకున్నారు. ఇది జైళ్లలో విద్యను కొనసాగించాలనే ఖైదీల ఆసక్తి, పట్టుదలకు నిదర్శనంగా నిలుస్తోంది. 10+2 పూర్తి చేసిన అనంతరం వారు చర్లపల్లి సెంట్రల్ ప్రిజన్‌లోని డా.బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ ద్వారా అండర్‌గ్రాడ్యుయేట్ బీఏ కోర్సుల్లో కూడా చేరే అవకాశం ఉంటుంది. ఈ కార్యక్రమానికి శ్రీ పరంప్రీత్ సింగ్, జాయింట్ డైరెక్టర్ ఇన్‌చార్జ్ ఎన్ ఐఓఎస్. డా. ప్రవీణ్ చౌహాన్, రీజినల్ డైరెక్టర్, ఎన్ ఐఓఎస్, హైదరాబాద్; వై.రాజేష్, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్; డా. డి.శ్రీనివాస్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్, హైదరాబాద్ రేంజ్ ఎం.సంపత్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్, వరంగల్ రేంజ్ జి.ప్రమోద్, సూపరింటెండెంట్, సెంట్రల్ ప్రిజన్, చర్లపల్లి డి.భరత్, సూపరింటెండెంట్, ప్రిజనర్స్ అగ్రికల్చరల్ కాలనీ లక్ష్మీ శ్రీనాథ్, సూపరింటెండెంట్, ఎస్పీడబ్ల్యు హైదరాబాద్ పి.అశోక్ కుమార్, సూపరింటెండెంట్, సెంట్రల్ ప్రిజన్, నిజామాబాద్, ఇతర సీనియర్ జైలు అధికారులు, ఎన్ఐఓఎస్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే మా ప్రాధాన్యత

- **వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల**
- **తుమ్మలతో బీహార్ వ్యవసాయ మంత్రి విజయ్‌కుమార్ భే□టీ**
- **ఆయిల్‌పామ్‌పై బీహార్.. మకానాపై తెలంగాణ ఆసక్తి**
- **సాంకేతికత, ఉత్పాదకత, పంటల వైవిధ్యీకరణపై మంత్రుల చర్చ**

**హైదరాబాద్, ఆగస్టు 12 :**

రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, వారి కోసం రెండున్నరేళ్లలో రూ.1.30 లక్షల కోట్లు ఖర్చు చేశామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బీహార్ వ్యవసాయ శాఖ మంత్రి విజయ్ కుమార్ సిన్హా మంత్రి తుమ్మలను సచివాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రెండు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, ఉత్తమ విధానాల అధ్యయనం, పంటల వైవిధ్యీకరణ తదితర అంశాలపై ఇరువురూ విస్తృతంగా చర్చించారు. వాతావరణ హెచ్చరికలను రైతులకు చేరవేయడం, రైతు నేస్తం ద్వారా రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అనుసంధానం, క్రాప్ బుకింగ్, శాటిలైట్ ఆధారిత పంటల పర్యవేక్షణ, యూరియా బుకింగ్ అప్లికేషన్, అగ్రిస్టాక్ ద్వారా రైతు గుర్తింపు వంటి డిజిటల్ కార్యక్రమాల గురించి వివరించారు. కృత్రిమ మేధ ఆధారిత 'కృషివాస' పంటల పర్యవేక్షణ వ్యవస్థ ద్వారా పంటల్లో సమస్యలను ముందుగానే గుర్తించి అవసరమైన ప్రాంతాల్లో సత్వర చర్యలు చేపట్టడం ద్వారా రైతుల పెట్టుబడి వ్యయాన్ని తగ్గించడం, దిగుబడిని పెంచడం, లాభదాయకతను మెరుగుపర్చే విధానాలను మంత్రి తుమ్మల వివరించారు. రైతుబంధు, రైతు బీమా, సన్న వడ్లకు బోనస్ తదితర కార్యక్రమాల అమలు తీరు గురించి బీహార్ మంత్రికి తెలిపారు. రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి సుమారు రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల వరకు రుణ మాఫీ చేశామని, సంవత్సరానికి రైతుభరోసా పథకం కింద ఎకరానికి రూ.12,000 ఇస్తున్నామని చెప్పారు. సన్నాలకు రూ.500 బోనస్ అందిస్తున్నామని, దేశంలోనే అత్యధిక వరి పండించిన రాష్ట్రం తెలంగాణే అని తెలిపారు. పంటల వైవిధ్యీకరణకు ఇస్తున్న ప్రాధాన్యతను కూడా మంత్రి తుమ్మల వివరించారు. తెలంగాణలో వరి, పత్తితోపాటు మొక్కజొన్న, కందులు, సోయాబీన్, మామిడి, ఎర్ర మిరప, పసుపు, ఆయిల్‌పామ్ తదితర పంటల సాగును విస్తరిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఆయిల్‌పామ్ సాగులో తెలంగాణ దేశంలో ముందంజలో ఉందని, 202526లో 3.11 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు ఉండగా, 74 వేల మెట్రిక్ టన్నుల క్రూడ్ పామ్ ఆయిల్ ఉత్పత్తితో 20.01 శాతం ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేషియో సాధించినట్లు చెప్పారు. ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, నర్సరీలు, ప్రాసెసింగ్ మిల్లులు, మైక్రో ఇరిగేషన్ వంటి మౌలిక సదుపాయాలపై కూడా బీహార్ మంత్రి ఆసక్తిగా వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**బీహార్‌లో 91 శాతం మంది చిన్న, సన్నకారు రైతులు**

బీహార్‌లో అమలు చేస్తున్న వ్యవసాయ విధానాలు, పంటల వైవిధ్యీకరణ, పంటల క్లస్టర్ల విధానం, సాంకేతిక వినియోగం తదితర అంశాలను బీహార్ మంత్రి విజయ్ కుమార్ సిన్హా తెలంగాణ ప్రతినిధులకు వివరించారు. బీహార్‌లో చిన్న, సన్నకారు రైతులు 91 శాతం ఉండగా, వ్యవసాయంపై ఆధారపడే జనాభా 77 శాతంగా ఉందని, వ్యవసాయ ఉత్పత్తుల వైవిధ్యానికి అనుగుణంగా ప్రత్యేక పంటల క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మకానా, మొక్కజొన్న, పండ్లుకూరగాయలు, తృణధాన్యాల కోసం ప్రత్యేక క్లస్టర్లను ఏర్పాటు చేసి ఉత్పత్తి, విలువ జోడింపు, మార్కెటింగ్ రంగాల్లో అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు బీహార్ ప్రతినిధులు వివరించారు. దర్భంగా, మధుబని, సీతామర్హి ప్రాంతాల్లో మకానా క్లస్టర్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. బీహార్‌లో మకానా పంటపై ప్రత్యేకంగా చేపడుతున్న కార్యక్రమాల పట్ల మంత్రి తుమ్మల ఆసక్తి కనబరిచారు. ఇటీవల మకానా ఉత్పత్తి, పరిశోధన, విలువ జోడింపు, మార్కెటింగ్, అంతర్జాతీయ అవకాశాలను పెంపొందించేందుకు మకానా బోర్డును ఏర్పాటు చేసినట్లు బీహార్ ప్రతినిధులు వివరించారు. గత పదేళ్లలో మకానా సాగు విస్తీర్ణం, ఉత్పత్తి, ఉత్పాదకత 2.5 రెట్లకు పైగా పెరిగినట్లు వివరించారు.

**ఆయిల్‌పామ్‌పై బీహార్, మకానాపై తెలంగాణ ఆసక్తి**

బీహార్‌లో ఆయిల్‌పామ్ సాగు అవకాశాలపై ఆ రాష్ట్ర మంత్రి ఆసక్తి వ్యక్తం చేయగా బీహార్‌లో ప్రత్యేకంగా సాగవుతున్న మకానా పంట, దాని ఉత్పత్తి, విలువ జోడింపు, మార్కెటింగ్ విధానాలపై మంత్రి తుమ్మల ఆసక్తి చూపారు. రెండు రాష్ట్రాల్లో రైతులకు ప్రయోజనం చేకూరే పంటల పరస్పర అధ్యయనం, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడికి దోహదం చేసుకోవాలని మంత్రి తుమ్మల కోరారు. ఇందుకోసం ఆయిల్‌పామ్ సాగు విధానాలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు బీహార్ నుంచి వ్యవసాయ శాఖ అధికారులు, ప్రతినిధుల బృందంతోపాటు రైతుల బృందాన్ని తెలంగాణకు ఆహ్వానిస్తున్నామన్నారు. తెలంగాణలో ఆయిల్‌పామ్ తోటలు, నర్సరీలు, ప్రాసెసింగ్ యూనిట్లు, సాగులో అనుసరిస్తున్న ఆధునిక విధానాలను వారు ప్రత్యక్షంగా పరిశీలించేలా ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. అదేవిధంగా మకానా సాగు, ప్రాసెసింగ్, విలువ జోడింపు, మార్కెటింగ్ విధానాలను అధ్యయనం చేసేందుకు తెలంగాణ నుంచి ప్రతినిధుల బృందాన్ని బీహార్‌కు పంపిస్తామని తెలిపారు. బీహార్‌లో ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, నాణ్యమైన నాటు సామగ్రి, సాగు విధానాలు, మైక్రో ఇరిగేషన్, ప్రాసెసింగ్ తదితర అంశాల్లో తెలంగాణ ప్రభుత్వం తనవంతు సహాయసహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. వ్యవసాయ రంగంలో రెండు రాష్ట్రాలకు ఉన్న ప్రత్యేక అనుభవాలు, సాంకేతిక పరిజ్ఞానం, పంటల వైవిధ్యీకరణ విధానాలను పరస్పరం పంచుకోవడం ద్వారా రైతుల ఆదాయం పెంపు, ఉత్పాదకత మెరుగుదల, విలువ జోడింపు, మార్కెట్ అవకాశాల విస్తరణకు మరింత ప్రయోజనం కలుగుతుందని మంత్రులు అభిప్రాయపడ్డారు. తెలంగాణబీహార్ మధ్య వ్యవసాయ సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, హాకా ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, కో ఆపరేటివ్ కమిషనర్ రాహుల్‌రాజ్, హార్టీకల్చర్ యూనివర్సిటీ వీసీ రాజిరెడ్డి, బీహార్ వ్యవసాయ శాఖ సెక్రటరీ నర్మదేశ్వర్ లాల్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ ముకేష్ కుమార్‌లాల్, హార్టీకల్చర్ డైరెక్టర్ అభిషేక్ కుమార్ పాల్గొన్నారు.

## అర్బన్ ఫార్మింగ్, మిద్దె పంటలతో ఆరోగ్యకరమైన జీవనానికి బాట

అర్బన్ ఫార్మింగ్, మిద్దె పంటలు, కిచెన్ గార్డెనింగ్‌ను నగర ప్రజల్లో విస్తృతంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని మంత్రి తుమ్మల అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన అర్బన్ ఫార్మింగ్ అండ్ కిచెన్ గార్డెనింగ్ ఎక్స్‌పో-2026లో ఆయన మాట్లాడారు. నగర ప్రజలకు తాజా ఆహారం, ఆరోగ్యకరమైన జీవనం, పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణపై అవగాహన కల్పించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఇంటి బాల్కనీ, టెర్రస్, ఇంటి ప్రాంగణం వంటి చిన్న ప్రదేశాల్లోనే కుండీలు, గ్రో బ్యాగులు, ఇతర కంటైనర్లలో కొత్తిమీర, పుదీనా, పాలకూర వంటి ఆకుకూరలు, కూరగాయలు, మూలికలను సులభంగా పెంచుకోవచ్చని మంత్రి తెలిపారు. నగరాల్లోని లక్షలాది కుటుంబాలు తమ ఇళ్లలో కొంతమేరకు ఆహారాన్ని స్వయంగా పండించుకోవడం ప్రారంభిస్తే దాని సమష్టి ప్రభావం ఎంతో గొప్పగా ఉంటుందన్నారు. వ్యవసాయం వ్యవసాయ క్షేత్రాలకే పరిమితం కాకుండా టెర్రస్‌లు, బాల్కనీలు, కమ్యూనిటీ స్థలాలు, పాఠశాలలు, కార్యాలయాలు, ఇతర సంస్థల ప్రాంగణాల్లోనూ కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, ఇతర మొక్కలను పెంచేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయాన్ని వాతావరణ మార్పులకు అనుగుణంగా మార్చుకోవాలని సూచించారు. తాజాగా పండిద్దాం-ఆరోగ్యంగా తిందాం-పచ్చగా జీవిద్దాం అనే సందేశం కేవలం నినాదంగా కాక ప్రతి కుటుంబ జీవన విధానంగా మారాలని మంత్రి ఆకాంక్షించారు. ఎక్స్‌పోకు వచ్చిన ప్రజలు ఎగ్జిబిటర్లు, నిపుణులతో చర్చించి అర్బన్ ఫార్మింగ్‌లోని కొత్త సాంకేతికతలను తెలుసుకుని తమ ఇళ్లు, సంస్థలు, కమ్యూనిటీలలో గార్డెన్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతు నేస్తం చైర్మన్ వై.వెంకటేశ్వరరావు, ఎఫ్‌టీసీసీఐ ప్రెసిడెంట్ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్మీ రిక్రూట్‌మెంట్ కోసం శిక్షణ ఇవ్వాలి

**హైదరాబాద్, ఆగస్ట్ 12:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని భారత ఆర్మీ సదరన్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్‌ఇన్‌చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ సి.రాజేష్ పుష్కర్ మర్యాదపూర్వకంగా కలిశారు. భారత ఆర్మీ చేపట్టే వివిధ నియామకాల్లో తెలంగాణ యువతను ప్రోత్సహించే విధంగా కలిసి పనిచేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా సీఎం తెలియజేశారు. ఆర్మీ నియామకాల్లో స్థానిక యువతకు భారీ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఆసక్తి చూపుతున్న, అనువైన జిల్లా కేంద్రాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. దేశవ్యాప్తంగా నిర్వహించే వివిధ ఆర్మీ రిక్రూట్మెంట్‌లకు ముందు ఆయా తెలంగాణ జిల్లా కేంద్రాల్లో యువతకు శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు లెఫ్టినెంట్ జనరల్ రాజేష్ సుముఖత వ్యక్తం చేశారు. అలాగే, విపత్తు నిర్వహణలో ఆర్మీ పాత్రపైనా సీఎం చర్చించారు. రాష్ట్రంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ ఆపరేషన్లు, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, పునరావాస చర్యల్లో ఆర్మీ యంత్రాంగం మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని కోరారు. తెలంగాణలో విపత్తు పరిస్థితుల్లో ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని స్థానిక ఆర్మీ అధికారులను ఆదేశిస్తామని రాజేష్ పుష్కర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును ఆయన కొనియాడారు. హైదరాబాద్ నగరాన్ని రక్షించడానికి, కాలుష్యాన్ని తగ్గించడానికి, చారిత్రక వైభవాన్ని తిరిగి తెచ్చేందుకు మూసీ నది పునరుజ్జీవం అవసరమని పేర్కొన్నారు. ఈ భేటీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మేజర్ జనరల్ శ్రీనివాస్ రావు, ఇతర ఆర్మీ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మిల్లర్ల నుండి బకాయిలు వసూలు చేయాల్సిందే

**హైదరాబాద్, ఆగస్టు 12 :**

డిఫాల్ట్ అయిన రైస్ మిల్లర్ల నుండి బకాయిలను వసూలు చేయాలి అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో సివిల్ సప్లయిస్ విభాగంపై పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి బుధవారం సమీక్ష నిర్వహించారు. బకాయిల వసూలుకు ఒక విధానాన్ని రూపొందించాలన్నారు. దీనిపై కేబినెట్ సబ్ కమిటీలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని, బకాయిల వసూలే ప్రధాన లక్ష్యంగా చర్యలు ఉండాలని అన్నారు. మిల్లర్ల బ్లాక్ మెయిల్‌ను సహించనని సీఎం హెచ్చరించారు. ఉద్దేశపూర్వకంగా డిఫాల్ట్ అయి బకాయిలు చెల్లించని రైస్ మిల్లులను స్వాధీనం చేసుకుని మహిళా సంఘాలకు అప్పగించే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు. మార్కెట్‌లో ఉన్న గోడౌన్‌లను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని, అవసరమైతే మిల్లింగ్ బాధ్యతల్ని మహిళా సంఘాలకు బాధ్యతలు అప్పగిస్తాని అన్నారు. ఐదు నియోజకవర్గాల్లో మహిళా సంఘాలకు 50 నుంచి 100 ఎకరాల్లో గోడౌన్‌ల నిర్మాణం కోసం పైలట్ ప్రాజెక్టు చేపట్టాలన్నారు. ధాన్యం ఎక్కువ దిగుబడి అయ్యే ప్రాంతాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయాలని, గోడౌన్‌ల నిర్మాణంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను వినియోగించుకోవాలని, ప్రతి జిల్లాకు నోడల్ అధికారిని నియమించాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సమీక్షా సమావేశంలో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ టవర్స్‌కు నేడు శ్రీకారం

**హైదరాబాద్, ఆగస్టు 12 :**

హైదరాబాద్ మహానగరంలో ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల కలను సాకారం చేసే దిశగా ప్రజా ప్రభుత్వం మరో చరిత్రాత్మక అడుగు వేస్తోందని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. క్యూర్ పరిధిలో చేపడుతున్న ప్రతిష్ఠాత్మక ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి గురువారం (13వ తేదీ) సాయంత్రం కూకట్‌పల్లి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని వెల్లడించారు. ఇళ్ల నిర్మాణంపై అధికారులతో మంత్రి బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూకట్‌పల్లిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్న ఐదు ఎకరాల స్థలంలో నాలుగు టవర్స్ నిర్మిస్తామని, ఒక్కో టవర్‌లో 120 చొప్పున ఫ్లాట్స్ ఉంటాయని చెప్పారు. ఒక్కో అంతస్తులో 12 ఫ్లాట్స్ ఉండేలా 480 ఫ్లాట్స్ నిర్మాణం జరుగుతుందని, ఇందుకు రూ.43.20 కోట్లు ఖర్చవుతుందని తెలిపారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ఇంతవరకు సుమారు 90 ఎకరాలను ఎంపిక చేశామన్నారు. హైదరాబాద్ నగరం నడిబొడ్డున పేదవాడి ఇంటికి పునాది వేయడం అంటే కేవలం ఒక భవనం నిర్మించడం కాదు.. ఒక కుటుంబానికి భద్రత, ఒక తరానికి భరోసా, పేదవాడికి గౌరవంతో కూడిన జీవితం అందించడమే అని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో భూముల ధరలు ఆకాశాన్ని తాకుతున్న నేపథ్యంలో నగరంలోనే సొంత ఇల్లు కావాలనే పేదల ఆకాంక్షను నెరవేర్చేందుకు ఇందిరమ్మ టవర్స్‌ను ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందన్నారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం హైదరాబాద్ గృహ నిర్మాణ రంగంలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదలు నగరానికి దూరంగా కాకుండా.. నగరంలోనే గౌరవంగా జీవించాలి అనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును రూపొందించిందన్నారు. నగరంలోని కీలక ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను సద్వినియోగం చేసుకుని బహుళ అంతస్తుల టవర్లను నిర్మించడం ద్వారా వేలాది పేద కుటుంబాలకు సొంతింటిని అందించనున్నామని తెలిపారు. ఇది ఒకసారి చేపట్టి ముగించే పథకం కాదని, హైదరాబాద్‌లో పేదల గృహ అవసరాలను దశలవారీగా తీర్చే నిరంతర గృహ నిర్మాణ కార్యక్రమని స్పష్టం చేశారు. క్యూర్ పరిధిలో ఈ ఏడాది లక్ష ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, తొలి విడతలో ప్రయోగాత్మకంగా 16 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సుమారు ఎనిమిది వేల ఇళ్లను నిర్మించనున్నట్లు వెల్లడించారు. గత నెల 20నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించామని, ఇప్పటివరకు సుమారు 50 వేల దరఖాస్తులు అందాయని మంత్రి తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 15 వరకు పొడిగించినట్లు చెప్పారు. ఇందిరమ్మ టవర్స్‌లో లబ్ధిదారులకు అందించే ఇళ్లు సౌకర్యవంతంగా, ఆధునిక ప్రమాణాలతో నిర్మించనున్నామని తెలిపారు. నగరంలోని అత్యంత కీలక ప్రాంతాలను గుర్తించి అవసరాన్నిబట్టి పది అంతస్తుల వరకు టవర్లను నిర్మించనున్నట్లు వివరించారు. ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న ఈ ఇళ్లలో లబ్ధిదారుడి పేరుతో అన్‌డివైడెడ్ షేర్ కింద సుమారు 20 నుంచి 25 గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. కొన్ని ప్రాంతాల్లో ఒక్కో లబ్ధిదారుడికి లభించే భూమి వాటా విలువ రూ.60 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉంటుందన్నారు. ఇలాంటి విలువైన ప్రాంతాల్లో పేదలకు సొంతింటి అవకాశం కల్పించడం దేశంలోని ఇతర మహానగరాలకు కూడా ఆదర్శంగా నిలిచే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయ్యాక అర్హతలను పూర్తిస్థాయిలో పరిశీలించి ఎలాంటి రాజకీయ జోక్యం, సిఫారసులు, అవకతవకలకు తావులేకుండా అర్హులైన పేదల నుంచి పారదర్శక పద్ధతిలో డ్రా/లక్కీడిప్ ద్వారా ఇళ్ల కేటాయింపు చేపడతామని తెలిపారు. ఇల్లు మంజూరు కాని దరఖాస్తుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారు చెల్లించిన ఈఎండీ మొత్తాన్ని వెంటనే తిరిగి చెల్లిస్తామని చెప్పారు. టవర్స్ నిర్మాణ పనులను ప్రణాళికాబద్ధంగా, వేగంగా పూర్తి చేసి వచ్చే ఏడాది బోనాల పండుగ సమయానికి ఎంపికైన లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. శంకుస్థాపన నుంచి నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రతి దశను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. గత ప్రభుత్వాల హయాంలో పేదలకు ఇళ్ల విషయంలో హామీలు మాత్రమే మిగిలాయని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మాత్రం హామీలను కార్యరూపంలోకి తీసుకొచ్చి పేదల ఇంటి తలుపు తట్టేలా గృహ నిర్మాణ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తోందని మంత్రి తెలిపారు.



## రూ.10, రూ.20 నోట్లకు
# పాలిమర్ రూపం

- రూ.200 కోట్ల నోట్లతో ప్రయోగాత్మక పరిశీలనకు కేంద్రం ఆమోదం
- కాగితపు నోట్లతో పాటే సమాంతరంగా చలామణి

న్యూఢిల్లీ, ఆగస్టు 11

తక్కువ విలువ కలిగిన కరెన్సీ నోట్ల మన్నికను పెంచేందుకు రూ.10, రూ.20 పాలిమర్ నోట్లను ప్రయోగాత్మకంగా చలామణిలోకి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం1934లోని సెక్షన్ 25 ప్రకారం వచ్చిన ప్రతిపాదన మేరకు 200 కోట్ల పాలిమర్ నోట్లను క్షేత్రస్థాయి పరిశీలన కోసం ప్రవేశపెట్టనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రాజ్యసభలో వెల్లడించారు.

**కాగితపు నోట్లతో కలిసే చలామణి**

ప్రస్తుతం ఈ ప్రక్రియ ప్రాథమిక దశలోనే ఉందని మంత్రి తెలిపారు. పాలిమర్ నోట్ల అధికారిక విడుదల తేదీ, తయారీ వ్యయం వంటి వివరాలు ఇంకా ఖరారు కాలేదని పేర్కొన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి వీటిని చలామణిలోకి తీసుకురావాలని ఆర్‌బీఐ యోచిస్తున్నట్లు వివరించారు.

**మన్నిక ఎక్కువ.. చిరిగే అవకాశం తక్కువ**

ప్రపంచంలోని పలు దేశాల్లో మూడు దశాబ్దాలుగా పాలిమర్ కరెన్సీ వినియోగంలో ఉందని ప్రభుత్వం తెలిపింది. సాధారణ కాగితపు నోట్లతో పోలిస్తే పాలిమర్ నోట్లు రెండు నుంచి నాలుగు రెట్లు ఎక్కువ కాలం మన్నుతాయని పేర్కొంది. ముఖ్యంగా తరచూ చేతులు మారే రూ.10, రూ.20 నోట్లు త్వరగా పాడవకుండా ఉండేందుకు ఈ విధానం ఉపయోగపడనుంది.

**ద్రవ్యోల్బణం అదుపులోనే**

దేశ ఆర్థిక పరిస్థితిపైనా నిర్మలా సీతారామన్ వివరాలు వెల్లడించారు. పశ్చిమాసియా సంక్షోభం, వాతావరణ మార్పుల ప్రభావంతో 202627 తొలి త్రైమాసికంలో రిటైల్ ద్రవ్యోల్బణం 3.9 శాతానికి చేరినా.. ఆర్‌బీఐ నిర్దేశించిన 4 శాతం లక్ష్యానికి లోపలే ఉందని చెప్పారు. జీఎస్‌టీ రేట్ల క్రమబద్ధీకరణతో పన్ను భారం తగ్గిందని, వార్షిక ఆదాయం రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపుతో ప్రజల ఖర్చు సామర్థ్యం పెరిగిందని తెలిపారు. దీంతో ప్రైవేట్ వినియోగం పుంజుకోవడంతో పాటు తక్కువ, మధ్యతరగతి కుటుంబాల కొనుగోలు శక్తికి ఊతం లభిస్తోందని పేర్కొన్నారు.

# చైనా అభ్యంతరాలపై భారత్ స్ట్రాంగ్ వార్నింగ్

- అరుణాచల్ ప్రదేశ్ మాదే.. ఎవరూ మార్చలేరు

న్యూఢిల్లీ, ఆగస్టు 11

అరుణాచల్ ప్రదేశ్‌లోని 27 ప్రాంతాలకు భారత్ అధికారికంగా పేర్లు పెట్టడంపై చైనా చేసిన అభ్యంతరాలపై కేంద్రం తీవ్రంగా స్పందించింది. అరుణాచల్ ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగమని, ఈ వాస్తవాన్ని ఎలాంటి చర్యలతోనూ మార్చలేరని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.

**27 ప్రాంతాలకు అధికారిక గుర్తింపు**

అరుణాచల్‌లోని 27 గ్రామాలు, భౌగోళిక ప్రాంతాలకు భారత్ అధికారిక పేర్లు ప్రకటించింది. సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌లో వాటిని నమోదు చేయడం ద్వారా ఆయా ప్రాంతాల గుర్తింపును మరింత స్పష్టం చేయడంతో పాటు ప్రజల్లో అవగాహన పెంచడం లక్ష్యమని ప్రభుత్వం తెలిపింది.

**చైనా తీవ్ర అభ్యంతరం**


భారత్ నిర్ణయాన్ని చైనా విదేశాంగ శాఖ తప్పుబట్టింది. అరుణాచల్‌ను 'సౌత్ టిబెట్', 'జాంగ్నాన్'గా పేర్కొంటున్న చైనా.. భారత చర్యను చట్టవిరుద్ధమైనదిగా అభివర్ణించింది.

**పేర్లు పెడితే వాస్తవాలు మారవు**

చైనా గతంలోనూ అరుణాచల్‌లోని పలు ప్రాంతాలకు పేర్లు పెట్టింది. అయితే చైనా ప్రకటించే కల్పిత పేర్లతో భౌగోళిక వాస్తవాలు మారవని భారత్ స్పష్టం చేసింది. అరుణాచల్ ప్రదేశ్ తమ దేశంలో విడదీయరాని భాగమనే విషయంలో ఎలాంటి సందేహం లేదని విదేశాంగ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు.

**ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం**

భారత్‌చైనా సంబంధాలను సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్న సమయంలో ఇలాంటి చర్యలు ఆ ప్రక్రియకు ఆటంకం కలిగించే అవకాశం ఉందని భారత్ పేర్కొంది.



# యూపీఐ పేమెంట్స్‌పై చార్జీలు ఉండవు

- కమ్యూనిస్టుల అబద్ధాల ప్రచారం తగదన్న నిర్మల

న్యూఢిల్లీ, ఆగస్టు 11:

రూపే, గూగుల్‌పే, ఫోన్‌పే వంటి యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)ల ద్వారా జరిపే లావాదేవీలకు చార్జీలు వసూలు చేస్తారన్న అనుమానాలను ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తోసిపుచ్చారు. ముఖ్యంగా కమ్యూనిస్టులు ఇలాంటివి ప్రచారం చేయడంలో ముందుంటారని ఎద్దేవా చేశారు. వీటిని ఉపయోగించే వినియోగదారుల నుంచి ఎలాంటి చార్జీలు వసూలు చేయబోరన్నారు. కొన్ని రకాల లావాదేవీలకు మాత్రం భవిష్యత్తులో మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) వసూలు చేసే అవకాశం ఉందని తెలిపారు. దీన్ని ఇంకా ఖరారు చేయలేదని, తరువాత నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారు. చార్జీలు వసూలు చేసేందుకు వీలు కలిగేంచేలా చట్టాన్ని సవరించామే తప్ప వినియోగదారుల నుంచి ఇప్పటికిప్పుడు వసూలు చేయడానికి కాదని చెప్పారు. ఏ వస్తువుపై ఎండీఆర్ వసూలు చేయాలి.. ఎంత ధరకు పరిమితం చేయాలన్న దాన్ని తరువాత నిర్ణయిస్తామని తెలిపారు. యూపీఐ విధానాన్ని 2016లో ప్రారంభించగా అప్పటినుంచి ఉచితంగా సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. అది కొనసాగుతుందని తెలిపారు. చిరు వ్యాపారులపై భారం పడబోదన్నారు. అమెరికా ఒత్తిడి మేరకే యూపీఐ చెల్లింపులపై రుసుములు వసూలు చేయాలని నిర్ణయించారని సీపీఎం సభ్యుడు జాన్ బ్రిట్టాస్ ఆరోపించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ 'కమ్యూనిస్టులే అంత.. వాస్తవాలు చెప్పరు. ఆపై వక్రీకరణలు' అని వ్యాఖ్యానించారు.

# ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరేద్దాం: మోదీ

- అభివృద్ధి చెందిన భారత్ కోసం ప్రతిజ్ఞ చేయాలని పిలుపు

న్యూఢిల్లీ, ఆగస్టు 11

స్వాతంత్ర్య దినోత్సవాన్ని గౌరవం, గర్వం, ఘనతతో జరుపుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణం కోసం సంకల్పం తీసుకోవాలని కోరారు. మంగళవారం ఇన్‌స్టాగ్రామ్‌లో ఆయన ఈ సందేశాన్ని వెల్లడించారు.

**ఇంటింటా జాతీయ జెండా**

''హర్ ఘర్ తిరంగా.. ఘర్ ఘర్ తిరంగా.. హర్ మన్ తిరంగా'' అంటూ మోదీ పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని, స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు అర్పించాలని సూచించారు. దేశభక్తి స్ఫూర్తితో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.



**ఎన్డీఏ నేతల ఘన స్వాగతం**

పార్లమెంట్ హౌస్‌లోని జీఎంసీ బాలయోగి ఆడిటోరియంలో జరిగిన ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్డీఏ ఎంపీలు, కేంద్ర మంత్రులు త్రివర్ణ పతాకాలను చేతబూని 'వందే మాతరం', 'భారత్ మాతా కీ జై' నినాదాలతో ఆయనకు స్వాగతం పలికారు. దీనికి సంబంధించిన వీడియోను మోదీ సామాజిక మాధ్యమంలో పంచుకున్నారు.

**సమావేశంలో పలువురు నేతలు**

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో పాటు కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్, నితిన్ గడ్కరీ, శివరాజ్‌సింగ్ చౌహాన్, ఎస్. జైశంకర్ సమావేశానికి హాజరయ్యారు. ఎన్డీఏ భాగస్వామ్య పార్టీల నేతలు, ఎంపీలు కూడా పాల్గొన్నారు.

# ఆంక్షల వ్యసనంలో అమెరికా

- దౌత్య మార్గంలో విఫలంతో ఆంక్షల కొరడా
- ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ

టెహ్రాన్, ఆగస్టు 11:

తమ దేశంపై ఆంక్షలు విధించడం అమెరికాకు వ్యసనంగా మారిందని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ విమర్శించారు. ఆంక్షలతో ఇరాన్‌ను 'ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాం' అని అమెరికా ఆర్థికశాఖ మంత్రి స్కాట్ బెసెంట్ చెప్పడంపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దౌత్య మార్గంలో లక్ష్యాలను సాధించలేనప్పుడల్లా అమెరికా ఆంక్షలు విధిస్తోందని ఆరోపించారు. అవి ఫలించకపోతే మరింత తీవ్రత పెంచుతోందని పేర్కొన్నారు. ఇది ఒక అలవాటుగా, చివరకు వ్యసనంగా మారిందని ఎక్స్ వేదికగా ఆయన మండిపడ్డారు. ఆంక్షలతో ఇరాన్‌ను లొంగదీసుకోవడం సాధ్యం కాదని బఘాయీ స్పష్టం చేశారు. దశాబ్దాలుగా ఇలాంటి ఆంక్షలను ఎదుర్కొంటూనే ఉన్నామన్నారు. అమెరికా నేతలు ఈ చెడు అలవాటును కొనసాగిస్తే.. సంక్షోభం నుంచి గౌరవప్రదంగా బయటపడే అవకాశాలను వారే దెబ్బతీసుకుంటారని హెచ్చరించారు.




మరోవైపు ఇరాన్ ప్రభుత్వం డిజిటల్ ఆస్తులు, రహస్య బ్యాంకింగ్ నెట్‌వర్క్‌లపై ఆధారపడుతోందని స్కాట్ బెసెంట్ ఆరోపించారు. వారి అక్రమ ఆర్థిక నెట్‌వర్క్‌లను గుర్తించి ధ్వంసం చేస్తామని తెలిపారు. ఇరాన్ సైన్యంలో కీలక నియామకాలు జరిగాయి. సుప్రీం నేత మొజ్తబా ఖమేనీ ఈ మార్పులు చేశారు. మేజర్ జనరల్ అలీ అబ్దొల్లాహిని సాయుధ దళాల చీఫ్‌గా, కియుమర్స్ హైదారిని డిప్యూటీగా నియమించారు. అలాగే ఐఆర్‌జీసీ కమాండర్‌గా మేజర్ జనరల్ అహ్మద్ వాహిదీ, డిప్యూటీగా మోస్తఫా ఇజాదీ బాధ్యతలు చేపట్టారు. మొజ్తబా సుప్రీం నేతగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సైన్యంలో చేసిన తొలి కీలక నియామకాలు ఇవే కావడం గమనార్హం.

# అమిత్ షా లోక్‌సభకు రాలేదు

- పిరికి వాడంటూ జైరామ్ రమేశ్ పోస్ట్

న్యూఢిల్లీ, ఆగస్ట్ 11:

విద్యార్థుల నిరసనలు, పోలీసు చర్యపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా వివరణ ఇవ్వాలంటూ ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలోనే మంగళవారం సైతం లోక్‌సభకు అమిత్ షా రాలేదంటూ కాంగ్రెస్ విమర్శలు ఎక్కుపెట్టింది. గద్దించేవారే పిరికివారని ఆయన మరోసారి నిరూపించినట్లు పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ 'ఎక్స' వేదికగా పోస్టు పెట్టారు. వాస్తవాలను పక్కనపెట్టేందుకు ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. అయినప్పటికీ.. కేంద్ర హోం మంత్రి ఈ రోజు కూడా లోక్‌సభకు హాజరు కాలేదు. 17 రోజులుగా లోక్‌సభ, రాజ్యసభలకు ఆయన గైర్హాజరు కావడం అనూహ్యం. ఆయన క్షేమంగానే ఉన్నారా? 1, 2 మధ్య అంతా సవ్యంగానే ఉందా?' అంటూ పరోక్షంగా ప్రధాని మోదీ, అమిత్ షాను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. విద్యార్థుల నిరసనలు, పోలీసు చర్యపై లోక్‌సభలో చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఇప్పటికే ప్రకటించారు. ఆ చర్చకు అమిత్ షా సమాధానమిస్తారని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. ఇప్పటివరకు లోక్‌సభ 17 రోజులపాటు జరగ్గా 11 బిల్లులను ఆమోదించింది. వాటిలో రెండింటిపైనే చర్చ జరిగింది. ప్రతిపక్షాల ఆందోళనల మధ్య మిగతా బిల్లులన్నీ చర్చ లేకుండానే ఆమోదం పొందాయి.



## జనగణమన తరహాలో
# వందేమాతరం

- చట్టపరమైన రక్షణ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

న్యూఢిల్లీ, ఆగస్టు 11:

భారత జాతీయ గీతం 'జన గణ మన' తరహాలోనే 'వందేమాతరం'కు కూడా ఇకపై చట్టపరమైన రక్షణ లభించనుంది. 'ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ హానర్ బిల్లు'కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ఆమోదం తెలిపారు. దీంతో ఈ బిల్లు చట్టంగా మారింది. 1971 నాటి బిల్లులోని సెక్షన్ 3ను సవరించడం ద్వారా 'వందేమాతరం'ను కూడా చట్టం పరిధిలోకి తీసుకొచ్చారు. జాతీయ గీతాన్ని అడ్డుకోవడం లేదా దాని గౌరవాన్ని భంగపరిచేలా వ్యవహరించడంపై చట్టపరమైన చర్యలకు అవకాశం ఉంటుంది. అయితే అదే స్థాయిలో వందేమాతరానికి ఇప్పటివరకు ప్రత్యేక రక్షణ లేదు. తాజా సవరణ వందేమాతరానికి కూడా చట్ట పరమైన రక్షణ కల్పించింది. కొత్త చట్టం ప్రకారం 'వందేమాతరం'గానం జరుగుతున్న సమయంలో ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం లేదా ఆ గానం చేస్తున్న సమూహానికి అంతరాయం కలిగించడం శిక్షార్హమైన నేరం. దీనికి మూడేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంటుంది. వందేమాతరానికి చట్టపరమైన రక్షణ కల్పించే సవరణ బిల్లును పార్లమెంట్ గత నెలలో ఆమోదించింది. అనంతరం రాష్ట్రపతి ఆమోదం కోసం పంపించారు. రాష్ట్రపతి ముర్ము సంతకం చేయడంతో బిల్లు ఇప్పుడు అధికారిక చట్టంగా అమల్లోకి వచ్చింది.

# పార్లమెంటులో అదే ప్రతిష్టంభన

- లోక్‌సభలో విపక్ష ఎంపీల ఆందోళన
- సభను వాయిదా వేసిన స్పీకర్ ఓం బిర్లా
- పార్లమెంట్ ఆవరణలో అధికార, విపక్ష ఎంపీల పరస్పర నినాదాలు

న్యూఢిల్లీ, ఆగస్ట్ 11:

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల చివరి దశలో అధికార, విపక్షాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. లోక్‌సభలో మంగళవారం మళ్లీ గందరగోళం చెలరేగింది. చర్చలో పాల్గొనాలని, సభను సజావుగా నడిపేలా సహకరించాలని విపక్ష సభ్యులకు పదేపదే స్పీకర్ ఓం బిర్లా విన్నవించారు. అయితే విపక్ష సభ్యులు పోడియంలోకి దూసుకుని వచ్చి తమ ఆందోళనలను కొనసాగించారు. మరోవైపు లోక్‌సభలో చర్చలు జరుగుతుండగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష సభ్యులు ప్లకార్డులు ప్రదర్శించడంతో స్పీకర్ ఓం బిర్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్థవంతమైన చర్చలు జరపాలని హితవు పలికారు. దీంతో స్పీకర్ తొలుత సభను మధ్యాహ్నం 2గంటల వరకు వాయిదా వేశారు. ప్రతిపక్షాల నినాదాల మధ్య సభ నేటికి వాయిదా పడింది. మంగళవారం పార్లమెంట్ ద్వారం వద్ద విపక్ష ఎంపీలు నిరసనలు చేపట్టారు. ఢిల్లీలో విద్యార్థుల నిరసనలపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా సభకు వచ్చి సమాధానం చెప్పాలంటూ విపక్ష ఎంపీలు నినాదాలు చేశారు. విద్యార్థుల ఆందోళనపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సోమవారం హామీ ఇచ్చారు. విద్యార్థుల ఆందోళనపై జరిగే చర్చకు హోం మంత్రి అమిత్ షా సమాధానమిస్తారని, అయితే ప్రతిపక్షాలు ప్రభుత్వ సమాధానాన్ని శాంతియుతంగా వినవలసి ఉంటుందని రిజిజు అన్నారు. కాగా, జార్ఖండ్‌లో ఉద్యోగార్థులపై పోలీసుల చర్య, అయోధ్య రామమందిర విరాళాల అపహరణకు నిరసనగా అధికార, విపక్ష ఎంపీలు నిరసనలు చేపట్టారు. పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద ఎన్డీయే, విపక్ష ఎంపీలు పోటాపోటీగా నినాదాలు చేశారు. జార్ఖండ్‌లో విద్యార్థుల నిరసనలపై చర్చ నుంచి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పారిపోతున్నారని ఎన్డీయే ఎంపీలు ఆరోపించారు . ఢిల్లీలో జులై 20న జరిగిన నిరసనలపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా జవాబుదారీతనం వహించాలని విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. కాగా, విపక్షాల ఆందోళనల నేపథ్యంలో సభను బుధవారానికి వాయిదా వేశారు. అధికార, విపక్షాల నిరసనలతో పార్లమెంట్ ప్రాంగణంలో కొంతసేపు గందరగోళం నెలకొంది. ఇరువర్గాల పోటాపోటీ నిరసనలతో పార్లమెంట్ ఆవరణలో గందరగోళం నెలకొంది. వర్షాకాల సమావేశాలు మొదలైనప్పటి నుంచి పార్లమెంట్‌లో వాయిదాల పర్వం కొనసాగుతోంది. సమావేశాలు తుదిదశకు చేరుకుంటుండటంతో.. అధికార విపక్షాల మధ్య రాజకీయ పంతం మరింత పెరిగింది. జంతర్‌మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళనలు, పోలీసు చర్యపై విపక్షాలు కోరినట్లుగా... హోంమంత్రి అమిత్‌షా సభలో సమాధానం ఇవ్వటానికి సిద్ధమని కేంద్రం సోమవారం ప్రకటించగా... ఊరికే ప్రసంగాలు కాదు... మేం అడిగిన ప్రశ్నలకే సమాధానం ఇవ్వాలంటూ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ మెలిక పెట్టారు.

# ఎఫ్‌సీఆర్‌ఏ బిల్లుపై కేంద్రం కీలక నిర్ణయం

- జేపీసీ పరిశీలనకు పంపించాలని నిర్ణయం

న్యూఢిల్లీ, ఆగస్టు 11

విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సీఆర్‌ఏ) సవరణ బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. బిల్లులో ప్రతిపాదించిన మార్పులు, నిబంధనలను సమగ్రంగా పరిశీలించేందుకు జేపీసీకి అప్పగించే ప్రక్రియను చేపట్టనుంది.

**విదేశీ నిధులపై నియంత్రణ**

విదేశాల నుంచి వచ్చే విరాళాలు, వాటి వినియోగం, విదేశీ నిధులు స్వీకరించే సంస్థల కార్యకలాపాలపై నియంత్రణను మరింత పటిష్ఠం చేయడమే సవరణల ప్రధాన ఉద్దేశంగా కేంద్రం పేర్కొంది. నిధుల వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేలా నిబంధనల్లో మార్పులు ప్రతిపాదించింది.



**విస్తృత పరిశీలనకు అవకాశం**

బిల్లును జేపీసీకి పంపడంతో ప్రతిపాదిత నిబంధనలపై అధికార, విపక్ష సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడించే అవకాశం ఏర్పడింది. కమిటీ అవసరాన్ని బట్టి అధికారులు, నిపుణులు, సంబంధిత సంస్థల ప్రతినిధుల నుంచి అభిప్రాయాలను సేకరించి బిల్లులోని అంశాలను పరిశీలించనుంది.

**పార్లమెంట్‌కు నివేదిక**

జేపీసీ పరిశీలన పూర్తయిన తర్వాత తన సిఫారసులతో కూడిన నివేదికను పార్లమెంట్‌కు సమర్పించే అవకాశం ఉంది. కమిటీ సూచనల ఆధారంగా బిల్లులో అవసరమైన మార్పులు చేసే అవకాశం కూడా ఉంటుంది.

**తదుపరి ప్రక్రియపై ఆసక్తి**

ఎఫ్‌సీఆర్‌ఏ చట్టం కింద విదేశీ నిధులు స్వీకరించే సంస్థలపై పలు నియంత్రణలు అమలులో ఉన్నాయి. నిధులు దుర్వినియోగం కాకుండా పర్యవేక్షణను బలోపేతం చేయడంపై సవరణల్లో దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. జేపీసీ పరిశీలన నేపథ్యంలో బిల్లుపై పార్లమెంట్‌లో మరింత విస్తృత చర్చకు అవకాశం ఏర్పడింది.

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు మరమ్మతులు చేపట్టాలి

- వసతులు కల్పించి త్వరగా వినియోగంలోకి తేవాలి..
- కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా

**శెనార్తి మీడియా, కరీంనగర్:** ఆరెపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు అవసరమైన మరమ్మతులను తక్షణమే చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రి నగరపాలక సంస్థ పరిధిలోని ఆరెపల్లిలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇళ్ల నిర్మాణం, ప్రస్తుత పరిస్థితి, పెండింగ్ పనులు, మరమ్మతులు అవసరమైన ప్రాంతాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అవసరమైన చోట నాణ్యతతో మరమ్మతులు చేపట్టి ఇళ్లను త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. నిర్మాణ పనులు చేపట్టిన ఏజెన్సీ ప్రతినిధులను పిలిపించి ఇళ్ల పరిస్థితిపై పూర్తి వివరాలు సేకరించాలని ఆదేశించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు విద్యుత్, తాగునీరు, ఇతర మౌలిక వసతులను వెంటనే కల్పించాలని సూచించారు. లబ్ధిదారులకు ఇళ్లు అందించే సమయానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను ముందుగానే ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.

# విద్యార్థినుల వసతులపై ప్రత్యేక శ్రద్ధ

- హాస్టళ్లలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి..
- కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**





విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. విద్యార్థినుల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు బుధవారం రాత్రి శంకరపట్నం మండలం కేశవపట్నంలోని మోడల్ స్కూల్ హాస్టల్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడిన కలెక్టర్ తాగునీరు, గదుల్లో లైట్లు, ఫ్యాన్లు, డస్ట్‌బిన్లు, వాష్‌రూమ్‌ల పరిశుభ్రతపై వివరాలు తెలుసుకున్నారు. భోజనం, టిఫిన్ నాణ్యతతో పాటు డైట్ మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా అని ఆరా తీశారు. విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

**కిచెన్, స్టోర్‌రూమ్‌ల పరిశీలన**

రెండు విద్యాసంస్థల్లోని కిచెన్, స్టోర్‌రూమ్‌లను కలెక్టర్ పరిశీలించారు. ఆహార పదార్థాల నిల్వ, వంటగది పరిశుభ్రత, ఇతర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని, డైట్ మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు.

**కోతుల బెడదపై చర్యలు తీసుకోవాలి**

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో కోతుల బెడద ఉందని విద్యార్థినులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. విద్యార్థినుల భద్రత, ఆరోగ్యం, పరిశుభ్రత, విద్యా వసతులపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ కష్టపడి చదువుకోవాలని, చదువుతో పాటు ఆటలకు సమయం కేటాయిస్తూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. తమ లక్ష్యాలను సాధించేలా పట్టుదలతో చదువుకోవాలని చెప్పారు. తనిఖీలో డీఈఓ చైతన్య జైనీ, విద్యాశాఖ కోఆర్డినేటర్లు అశోక్‌రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# కరీంనగర్‌లో తాగునీటి సమస్య రావొద్దు

**ప్రజలకు ఇబ్బందులు లేకుండా సరఫరా చేయాలి : కలెక్టర్ చిత్రా మిశ్రా**

**శెనార్తి మీడియా, కరీంనగర్:**



కరీంనగర్ నగర ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్య లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం గౌతమ్‌నగర్‌లోని మంచినీటి ఫిల్టర్ బెడ్‌ను ఆమె పరిశీలించి నీటి లభ్యత, శుద్ధి, సరఫరా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎల్ఎండీ రిజర్వాయర్‌లో నీటి నిల్వలు తక్కువగా ఉండటంతో ప్రస్తుతం రోజుకు సుమారు 50 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేస్తున్నట్లు అధికారులు తెలి పారు. మున్సిపల్, మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్ల ద్వారా నీటిని శుద్ధి చేస్తున్నట్లు వివరించారు. నీటి శుద్ధిలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, సరఫరాలో ఎలాంటి సమస్య తలెత్తినా వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. పరిశీలనలో నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీఓ షర్మిల, మున్సిపల్ ఈఈ లచ్చిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



## తాడికల్‌లో వాహనాల తనిఖీలు

**శెనార్తి మీడియా శంకరపట్నం**

కరీంనగర్‌లో బీఆర్ఎస్, బీజేపీ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో శంకరపట్నం మండలం తాడికల్ గ్రామ శివారులో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు.కేశవపట్నం ఎస్సై శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో అనుమానాస్పద వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా తనిఖీలు నిర్వహించినట్లు ఎస్సై శేఖర్ రెడ్డి తెలిపారు.





# కొత్తగట్టు–గొల్లపల్లి మధ్య అండర్‌పాస్ నిర్మించాలి

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**



శంకరపట్నం మండలం కొత్తగట్టు, గొల్లపల్లి గ్రామాల మధ్య అండర్‌పాస్ నిర్మించాలని కోరుతూ ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రాకు వినతిపత్రం అందజేశారు. జాతీయ రహదారి–563 నిర్మాణంతో గ్రామస్తులు, విద్యార్థులు రహదారి దాటేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు కలెక్టర్‌కు వివరించారు. గొల్లపల్లి గ్రామంలో రహదారికి ఒకవైపు ప్రాథమిక పాఠశాల, మరోవైపు అంగన్వాడీ కేంద్రం ఉన్నాయని తెలిపారు. దీంతో ఉదయం, సాయంత్రం విద్యార్థులు రహదారి దాటాల్సి వస్తుండటంతో భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. అండర్‌పాస్ నిర్మాణం చేపట్టకపోవడం వల్ల ఇటీవల కొత్తగట్టులో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందిన విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

**నాలుగు కిలోమీటర్ల మేర ప్రయాణం**

రహదారి దాటేందుకు వీలు లేకుండా నిర్మాణం చేపట్టడంతో యూటర్న్‌లను మొలంగూర్ క్రాస్ వద్ద, కొత్తగట్టు మత్స్యగిరీంద్ర స్వామి గుట్ట వద్ద ఏర్పాటు చేశారని తెలిపారు. దీంతో గ్రామస్తులు రహదారి దాటేందుకు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**సమస్య పరిష్కారానికి హామీ**

సమస్యను జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ పీడీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చినట్లు గ్రామ ప్రజాప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు మదారపు విద్యాసాగరరావు, మాడా సుజాత రాజిరెడ్డి, ఉప సర్పంచులు వీరేందర్‌రెడ్డి, బాగోతం కుమార్, మత్స్యగిరీంద్ర స్వామి ఆలయ మాజీ చైర్మన్లు ఉప్పుగల్లా మల్లారెడ్డి, సాగి మలహల్‌రావు, శ్యాంరావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మంత్రి తుమ్మలను కలిసిన పీఏసీఎస్ చైర్మన్లు



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ మినిస్టర్ క్వార్టర్స్‌లో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును శంకరపట్నం మండలానికి చెందిన నూతనంగా ఎన్నికైన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. శంకరపట్నం మండలం నుంచి గోపగోని బస్వయ్య, గాజుల మహేష్, కీసర సంపత్, నూతనంగా సహకార సంఘాల చైర్మన్లుగా ఎన్నికై మంత్రిని కలిశారు. రైతుల సంక్షేమం, సహకార రంగం అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ సమర్థవంతంగా పనిచేయాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

# వ్యసనాలకు దూరంగా ఉండాలి



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

నషా ముక్త్ భారత్‌లో భాగంగా దేశవ్యాప్తంగా 10 కోట్ల మంది వ్యసనపరులను వ్యసనాల నుంచి విముక్తి చేయాలనే లక్ష్యంతో బ్రహ్మకుమారి సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని మొలంగూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కంకణాల నీరజ అన్నారు. బుధవారం పాఠశాలలో బ్రహ్మకుమారి సంస్థ హుజురాబాద్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు నషా ముక్త్ భారత్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి శ్రీవాణి సంస్థ లక్ష్యాలు, ఉద్దేశాలను వివరించారు. వ్యసనాల వల్ల కలిగే అనర్థాలు, వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబం, సమాజంపై వాటి ప్రభావాలను విద్యార్థులకు వివరించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.

**విద్యార్థులతో ప్రతిజ్ఞ**

సంస్థ ప్రతినిధి గుంటి రాజయ్య విద్యార్థులతో చెడు అలవాట్లకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నిర్వహించిన మెడిటేషన్ కార్యక్రమం విద్యార్థులకు మానసిక ప్రశాంతత, ఏకాగ్రతకు ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు.

**అవగాహన కార్యక్రమాలు అభినందనీయం**

ప్రధానోపాధ్యాయురాలు కంకణాల నీరజ మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధులను అభినందించారు. వ్యసనాల దుష్పరిణామాలను చిన్ననాటి నుంచే విద్యార్థులకు తెలియజేయడం అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమానికి అవకాశం కల్పించినందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలికి బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## బెజ్జంకి పాక్స్ చైర్మన్‌గా ఒగ్గు దామోదర్

**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

బెజ్జంకి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పాక్స్) చైర్మన్‌గా ఒగ్గు దామోదర్ నియమితులైన సందర్భంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కత్తి రమేష్ ఆధ్వర్యంలో టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తూ, ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ గెలుపు కోసం పనిచేసిన ఒగ్గు దామోదర్‌కు పాక్స్ చైర్మన్ బాధ్యతలు అప్పగించడం అభినందనీయమన్నారు. ఆయన నాయకత్వంలో సహకార సంఘం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దామోదర్‌ను చైర్మన్‌గా నియమించిన ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, మాజీ దేవస్థానం చైర్మన్ జెల్ల ప్రభాకర్ యాదవ్, మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య, వార్డు సభ్యులు బోనగం రమేష్ గౌడ్, ఇస్కిల్ల ఐలయ్య, పూర్మ నారాయణ రెడ్డి, ఐలేని మహేందర్ రెడ్డి, గుబిరే చంద్రం, సంఘ రమేష్, బుట్ల చంద్రప్రకాష్, బోనగిరి చంద్రం, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## చెరువు కట్టపై కొండచిలువ కలకలం

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

మండలంలోని కన్నాపూర్ గ్రామ చెరువు కట్టపై కొండచిలువ ప్రత్యక్షం కావడంతో స్థానికులు, బాటసారులు భయాందోళనకు గురయ్యారు. రహదారిపైకి వచ్చిన భారీ కొండచిలువను చూసి కొంతసేపు ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించారు. కొద్దిసేపటి తర్వాత కొండచిలువ ఎలాంటి హాని చేయకుండా రహదారి నుంచి చెరువు కట్ట కిందికి వెళ్లిపోయింది. దీంతో స్థానికులు, బాటసారులు ఊపిరి పీల్చుకున్నారు. కొండచిలువ సురక్షితంగా వెళ్లిపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు

# గుండ్లపల్లిలో భారీ తిరంగా ర్యాలీ



**శెనార్తి మీడియా, గన్నేరువరం:**

గన్నేరువరం మండలం గుండ్లపల్లి స్టేజి వద్ద 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బీజేపీ గన్నేరువరం మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ ఆధ్వర్యంలో జరిగిన తిరంగా ర్యాలీలో సుమారు 200 మీటర్ల పొడవైన భారీ త్రివర్ణ పతాకాన్ని విద్యార్థులు చేతబట్టి రాజీవ్ రహదారి మీదుగా గుండ్లపల్లి వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. దేశభక్తి నినాదాలతో గ్రామం మార్మోగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సంఘ నరేష్ మాట్లాడుతూ.. జాతీయ జెండా భారతదేశ సార్వభౌమత్వం, ఐక్యత, త్యాగాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. ప్రతి ఒక్కరిలో దేశభక్తి భావాన్ని పెంపొందించడమే హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులు దేశ భవిష్యత్తుకు మార్గదర్శకులని, దేశ ఐక్యత, సమగ్రతను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ మాట్లాడుతూ.. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు. భారీ సంఖ్యలో విద్యార్థులు ర్యాలీలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కొండాపూర్ సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ, పీచుపల్లి సర్పంచ్ సామా రాజిరెడ్డి, కరివేద మహిపాల్ రెడ్డి, ఏలేటి చంద్రారెడ్డి, బండి తిరుపతి, బొమ్మాడి సురేందర్ రెడ్డి, పుల్లెల రాము, గన్నేరువరం 8వ వార్డు సభ్యుడు మచ్చ సాయికృష్ణ, పంబాల రాజశేఖర్, పకిడ మహేందర్, బోయిని అభిషేక్, చొక్కాల లక్ష్మయ్య, కుర్ర హరీష్‌తో పాటు ప్రజలు, విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# పాఠశాలల్లో 'ప్రతిజ్ఞ' రచయిత పైడిమర్రి సుబ్బారావు

## నేడు పైడిమర్రి వెంకట సుబ్బారావు వర్ధంతి

మనదేశంలో ఉదయం దాదాపు ప్రతి పాఠశాలలో ప్రార్ధనా సమయంలో ఇంగ్లీష్ లోనో, తెలుగు లోనో, ఇతర భాషలలోనో తప్పనిసరిగా పిల్లలు చదివే "భారత దేశం నా మాతృభూమి, భారతీయు లందరూ నా సహోదరులు.." అనే "ప్రతిజ్ఞ" (ప్లెడ్జ్) రాసిన గొప్ప జాతీయ భావాలు కలిగిన రచయిత మాత్రం చాలా మందికి తెలియదు. ప్రతి రోజు విద్యార్థులు పాఠశాల దిన చర్యను ప్రారంభించే ముందు వందే మాతరం, జనగణమన జాతీయ గీతాలతో పాటు 'భారతదేశము నా మాతృభూమి..' అనే ప్రతిజ్ఞను సామూహికంగా చేసే విషయం నిత్య అనుసరణీయమే. వందేమాతరం రాసింది బంకించంద్ర ఛటర్జీ, జనగణమన రాసింది రవీంద్రనాథ్ ఠాగూర్ అని, సారే జహాసే అచ్ఛా రాసింది మహమ్మద్ ఇక్బాల్ అని పిల్లలను అడిగితే సమాధానం చెప్తారు. పాఠశాల క్విజ్ పోటీలలో తప్పక వేసే ప్రశ్నలు ఇవి. కానీ ప్రతిజ్ఞ రచయిత గురించి పుస్తకాలలో లేక ఉపాధ్యాయులకు, విద్యార్థులకు తెలియ పరచకుండా ఉంచడమే బాధాకరం. తెలంగాణ లోని నల్గొండ సమీపంలోని అన్నెపర్తిలో పుట్టడమే ఆయన చేసుకున్న పాపమో, లేక ఈ తెలంగాణ గడ్డకు కలిగిన శాపమో? నాటి పాలకుల పక్షపాత వైఖరియో తెలియదు కాని...జాతీయ భావం ప్రేరేపించే ప్రతిజ్ఞ యాభై ఏళ్లకు పైబడి పాఠ్య పుస్తకాల్లో ముద్రితమై కనిపిస్తున్నా అది రాసిన రచయిత పేరు దశాబ్దాలుగా ఎక్కడా ప్రస్తావించక పోవడం బాధాకరం. తెలుగుతో పాటు సంస్కృతం, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ, గుజరాతీ, మరాఠీ.. తొమ్మిది భాషల్లోకి అనువాదమై, ఆరు దశాబ్దాల కిందటి నుంచే పాఠ్య పుస్తకాల్లో ప్రచురించిన ఈ ప్రతిజ్ఞను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాతే గుర్తించడం గమనార్హం. కారణం ఈ ప్రతిజ్ఞను రాసింది తెలంగాణ వాసి కావడమే. ఆయనే నల్గొండ జిల్లా, అన్నెపర్తికి చెందిన తెలుగు రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు. వెంకట సుబ్బారావు (1916 జూన్ 10 – 1988 ఆగష్టు 13) 1916, జూన్ 10న పైడిమర్రి వెంకట రామయ్య, రాంబాయమ్మ దంపతులకు నల్లగొండ కేంద్రానికి సమీపంలో ఉండే అన్నెపర్తిలో జన్మించారు. విద్యాభ్యాసం మొత్తం అన్నెపర్తి, నల్లగొండ లోనే సాగింది. తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీష్, అరబిక్ భాషల్లో నిష్ణాతులు. హైదరాబాద్ రాష్ట్రం లోనే ట్రెజరీ విభాగంలో ప్రభుత్వోద్యోగం సంపాదించారు. ఆ తర్వాత ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడ్డాక ఖమ్మం, నిజామాబాద్, నెల్లూరు, విశాఖపట్నం, నల్లగొండ జిల్లాల్లో పనిచేశారు. ఉద్యోగ విరమణ అనంతరం 1988 ఆగష్టు 13 న అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. ఆయన జమిందారీ, భూస్వామ్య వెట్టిచాకిరీని నిరసిస్తూ ఎన్నో కథలు రాశారు. ఆయన తన 18వ ఏటనే కాలభైరవుడు (1936) పేరున చిన్న నవల రాశారు. దేవదత్తుడు, తులసీదాసు, త్యాగరాజు మొదలైన పద్య కావ్యాలు, బ్రహ్మ చర్యము, గృహస్థ జీవితము, స్త్రీ ధర్మము, ఫిరదౌసి, తార, శ్రీమతి అనే నాటకాలు రాశారు. సింగపురీ నృకేసరీ శతకం, బాల రామాయణం మొదలైన రచనలు, అనేక అనువాద రచనలు కూడా చేశారు. గోలకొండ, సుజాత, ఆంధ్రపత్రిక, భారతి, నవజీవన్, ఆనందవాణి పత్రికలలో అయన రచనలు ప్రచురితమైనాయి. ఆయన పద్యాలు గోలకొండ కవుల సంచికలోను, కథలు ఉషస్సు కథా సంకలనం, తెలంగాణ తొలితరం కథలులో 'నౌకరి' కథ వచ్చింది. 1945లోనే ఉషస్సు కథల సంపుటిని వెలువరించారు. 1945–46 లలో నల్లగొండలో జరిగిన ఆంధ్రసారస్వత పరిషత్తు సభలలో ప్రముఖ పాత్ర వహించారు. పదవీ విరమణ తర్వాత సర్వేలు గురుకుల పాఠశాలలో కొంతకాలం స్వచ్ఛందంగా పనిచేశారు.

1962 చైనా యుద్ధ సమయంలో ఆయన విశాఖ పట్టణంలో ట్రెజరీ అధికారిగా పనిచేస్తున్న కాలంలో, విద్యార్థులలో దేశభక్తిని పెంపొందిం చేందుకు పైడిమర్రి "ప్రతిజ్ఞ"కు రూపకల్పన చేశారు. రాసిన దానిని 1963లో విశాఖపట్నం లోని ఒక పాఠశాలలో తొలిసారిగా ప్రతిజ్ఞ చేయించారు. "ప్రతిజ్ఞ"ను ప్రముఖ రాజకీయవేత్త, స్వాతంత్ర్య సమర యోధుడు తెన్నేటి విశ్వనాథం దృష్టికి తీసుకెళ్లగా, సాహితీవేత్త అయిన అప్పటి విద్యాశాఖ మంత్రి, విజయ నగరం రాజాగా పేరు గాంచిన పీవీజీ రాజుకు అంద చేశారు. ఆయన నాటి ముఖ్య మంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డితో చర్చించారు. 1963లో "ప్రతిజ్ఞ" ను పాఠ్య పుస్తకాలలో చేర్చి ప్రతిరోజు ప్రార్ధనా సమయంలో చదివిం చాలని ఉత్తర్వులు జారీ చేసారు. 1964లో బెంగుళూరులో ప్రముఖ న్యాయ నిపుణుడు మహ్మద్ కరీం చాగ్లా అధ్యక్షతన కేంద్రీయ విద్యా సలహా మండలి సమావేశం జరిపి నపుడు జాతీయ ప్రతిజ్ఞగా స్వీకరించారు. తరువాత దీన్ని అన్ని భాషల్లోకి అనువాదం చేయించారు. 1965 తర్వాత కేంద్ర ప్రభుత్వం దీనిని ఇంగ్లిష్ లో పొందుపరచి దేశవ్యాప్తంగా అమలు చేశారు. పైడిమర్రి రాసిన ప్రతిజ్ఞలో కాలాను గుణంగా కొన్ని స్వల్ప మార్పులు జరిగి, కొన్ని గ్రాంథికం పదాల స్థానంలో వాడుక భాష వాడి, ఇతర భాషల్లోకి అనువదించి 1963 నుంచి దేశ ప్రతిజ్ఞగా అమలులోకి తెచ్చారు. 1965 జనవరి 26 నుంచి దేశ వ్యాప్తంగా పాఠశాలల్లో చదువు తున్నారు. పాఠ్య పుస్తకాలలో ప్రచురిస్తున్న ప్రతిజ్ఞకు పైడిమర్రి వెంకట సుబ్బారావు పేరును ముద్రించాలని తెలంగాణ విద్యావంతుల వేదిక 2014 నవంబరు 27న రాష్ట్రపతికి, ప్రధాన మంత్రికి, రాష్ట్ర గవర్నర్‌కు తెలంగాణ సీఎం కెసీఆర్ కు విజ్ఞప్తి చేయగా, 2015–16 విద్యా సంవత్సరం నుంచి కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో అన్ని భాషల్లో అన్ని ప్రభుత్వ పాఠ్య పుస్తకాలలో జాతీయ ప్రతిజ్ఞతో పాటు రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు పేరును ముద్రిస్తున్నారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో తెలుగు వారి భాగస్వామ్యం


**తొమ్మిది దశాబ్ధాల క్రితం 1930 ఏప్రిల్ 6 న మహాత్మా గాంధీ దండిలో ఉప్పు చట్టాలను ఉల్లంఘించి, వేలాది మందితో నిరసన తెలిపి, లక్షలాది మందిని చైతన్య పరిచిన సంఘటన. ఉప్పు పన్నును ధిక్కరిస్తూ మహాత్మా గాంధీ, 1930 మార్చి 12 నుండి 1930 ఏప్రిల్ 6 వరకు, 384 కిలోమీ టర్ల దూరం, వేలమంది సత్యాగ్రహులతో కలిసి పాదయాత్ర చేసి గుజరాత్ లోని దండి వద్ద ఉప్పు తయారు చేసి స్ఫూర్తిని కల్పించిన మరిచి పోలేని నేపథ్యం.**



భారత దేశ స్వాతంత్ర్య సమర చరిత్రలో బ్రిటిషు పాలనకు వ్యతిరేకంగా జరిపిన శాసనోల్లంఘనలో భాగంగా, మహాత్మా గాంధీ నేతృత్వంలో భారత జాతీయ కాంగ్రెసు జరిపిన అహింసాయుత సత్యాగ్రహమే ఉప్పు సత్యాగ్రహం. అది మహాత్మా గాంధీచే ప్రారంభించ బడిన ఒక అహింసా ప్రచారోద్యమం. ఇది బ్రిటిష్ రాజ్ కు వ్యతిరేకంగా జరిగింది. ఉప్పుపై పన్ను చెల్లిం చేందుకు నిరాకరించి, మార్చి 12, 1930న చేప ట్టిన దండి యాత్రనే ఉప్పు సత్యాగ్రహంగా పేర్కొంటారు. సంపూర్ణ స్వరాజ్యం కోసం బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా చేపట్టిన ఉద్య మాల సారమే ఈ ఉప్పు సత్యాగ్రహం. ఈ యాత్ర సబర్మతి ఆశ్రమం నుంచి ఎనభై మందితో ప్రారంభమై గుజరాత్ లోని సముద్ర తీరంలో ఉన్న పల్లెటూరు దండి వరకూ సాగింది. కనుక దీనికి ఉప్పు సత్యాగ్రహ కార్యక్రమంగా పేర్కొంటారు. కోట్లమంది భారతీయులపై బ్రిటిష్ రాజ్ వేసే ఉప్పు పన్నుకు వ్యతిరే కించిన మౌన నిరసన కార్యక్రమం అది. దానిని దండి సత్యాగ్రహం అనీ, దండి యాత్ర అనీ, దండి మార్చ్ అనీ పిలుస్తారు. 1920 – 22 నాటి సహాయ నిరాకరణోద్యమం తరువాత ఈ మార్చ్ బ్రిటిష్ అధికారానికి అత్యంత ముఖ్యమైన వ్యవస్థీకృత సవాలు విసిరింది. 1930 జనవరి 26 న భారత జాతీయ కాంగ్రెస్ సంపూర్ణ స్వరాజ్య నినాదం ప్రకటించిన వెంటనే దండి సత్యాగ్రహం మొదలైంది. ఉప్పు పన్ను బ్రిటిష్ రాజ్ పన్ను ఆదాయంలో 8.2% వరకూ ఉంటుంది. పేద భారతీయులకు చాలా భారంగా ఉండే పన్ను ఇది. ఉప్పు తయారీనే నిరసనకు, సత్యాగ్రహానికి తాను ఎందుకు ఎంపిక చేసిందీ వివరిస్తూ గాంధీ... "గాలి, నీరూ... ఆ తరువాత బహుశా ఉప్పే జీవితానికి అత్యవసరం" అని అని పేర్కొన్నారు. ఉప్పు చట్టాలను ధిక్కరించడం ద్వారా గాంధీ శాసనోల్లంఘనను ప్రారంభిస్తారని ఫిబ్రవరి 5 న వార్తా పత్రికలు రాసాయి. ఉప్పు సత్యాగ్రహం మార్చి 12 న అహ్మదాబాదు లోని సబర్మతి ఆశ్రమంలో ప్రారంభమై ఏప్రిల్ 6 న దండిలో ముగుస్తుందని పత్రికలు పేర్కొన్నాయి. ఉప్పు పన్నును ధిక్కరిస్తూ మహాత్మా గాంధీ,1930 మార్చి 12 నుండి 1930 ఏప్రిల్ 6 వరకు, 384 కిలోమీటర్ల దూరం, వేలమంది సత్యాగ్ర హులతో కలిసి పాదయాత్ర చేసి గుజరాత్ లోని దండి వద్ద ఉప్పు తయారు చేసారు. శాసనోల్లంఘన ఉద్యమంలో ఎక్కువ మంది పాల్గొనేలా స్ఫూర్తినిచ్చే బలమైన ప్రారంభ ఘటనగా దండి యాత్ర ఉపయోగ పడింది. మహాత్మా గాంధీ తన 79 మంది సత్యాగ్రహ వాలంటీర్లతో సబర్మతి ఆశ్రమంలో ఈ యాత్రను ప్రారంభించారు. ఈ సత్యాగ్రహం ప్రారంభానికి కొన్నిరోజులకు ముందే బ్రిటిష్ వారు గాంధీని మార్చి 5, 1930 న అరెస్టు చేశారు. ఈ సత్యాగ్రహం దాదాపు ఒక సంవత్సర కాలం నడిచింది. ఈ సత్యాగ్రహం మూలంగా దాదాపు 80,000 వేలకు పైగా భారతీయులు కారాగారాల పాలయ్యారు. లక్షల కొద్దీ భారతీయులు స్వాతంత్రోద్యమం పట్ల ఆకర్షితుల య్యారు. దండి మార్చిలో మహాత్ముడితో పాటు 79 మంది అనుచరులు పాల్గొన్నారు. ఆంధ్ర ప్రాంతం నుంచి దండి మార్చిలో గాంధీతో పాటు నడిచిన ఏకైక తెలుగు వ్యక్తి యెర్నేని సుబ్రహ్మణ్యం. తర్వాత కాలంలో ఆయన గాంధీ సిద్ధాంతాలతో కొమరవోలులో ఒక ఆశ్రమాన్ని స్థాపించారు. నెల్లూరులో ఉప్పు సత్యాగ్రహం నిర్వహించిన దండు నారాయణ రాజును నాటి ప్రభుత్వం అరెస్టు చేసి జైల్లో పెట్టడంతో ఆయన అక్కడే మరణించారు. ఉప్పు సత్యా గ్రహం సమయం లోనే 'కవిరాజు' త్రిపురనేని రామస్వామి చౌదరి... "వీర గంధము తెచ్చినారము వీరులెవ్వరొ తెల్పుడి" అనే గేయ కవితను రాశారు. మాక్సిం గోర్కీ రాసిన రష్యన్ నవల 'ది మదర్'ను 'అమ్మ' పేరుతో తెలుగులోకి అనువదించిన క్రొవ్విడి లింగరాజు ఈ ఉద్యమ సమయంలోనే దేశ ద్రోహం నేరంపై జైలుకెళ్లారు. బ్రహ్మ జోస్యుల సుబ్రహ్మణ్యం సీతానగర ఆశ్రమాన్ని స్థాపించారు. దీన్నే 'ఆంధ్రా దండి'గా పిలుస్తారు. ఉప్పు సత్యాగ్రహం సందర్భం లోనే కేంద్ర శాసన సభకు రామదాసు పంతులు, శాసన మండలి సభ్యత్వానికి స్వామి వెంకటాచలం రాజీనామాలు చేశారు. ఉప్పు చట్టాలను ఉల్లఘించి బులుసు సాంబమూర్తి, ఉన్నవ లక్ష్మీనారాయణ ( మాలపల్లి నవల రచయిత), ఖాసా సుబ్బారావు లాఠీ దెబ్బలు తిన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు మద్రాసులోని తన నివాసం వేదవనంలో సత్యాగ్రహ కేంద్రాలను ఏర్పాటు చేశారు. విశాఖ పట్నంలో తెన్నేటి విశ్వనాథం, మచిలీ పట్నంలో అయ్యదేవర కాళేశ్వరరావు, రాయలసీమ పరిధిలో కల్లూరి సుబ్బారావు ఉప్పు సత్యాగ్రహానికి నాయకత్వం వహించారు. నెల్లూరులోని మైపాడు బీచ్‌లో బెజవాడ గోపాలరెడ్డి ఉప్పు తయారు చేసి ప్రజలకు అమ్మారు. అలా లక్షలాది మంది తమ సొంత ఉప్పును తయారు చేసు కున్నారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# జాతీయ గీతం జనగణమన



**భారతదేశ జాతీయగీతం 'జనగణమన' గీతాన్ని విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన విషయం అందరికీ తెలిసిందే. అయితే జనగణమనకు ఆ స్వరాన్ని కట్టింది ఒక ఐరిష్ జాతీయురాలని... దానికి వేదికైంది చిత్తూరు జిల్లా మదనపల్లె అనే విషయం చాలా మందికి తెలియదు.**

నోబెల్ బహుమతి గ్రహీత, రవీంద్రనాథ్ టాగోర్ రాసిన బెంగాలీ గీతం లోని మొదటి భాగం ఇది. సంస్కృత పద భూయిష్టమైన బెంగాలీ భాషలో ఉంది. జనగణమన గీతాన్ని విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ నిజానికి 1911లోనే రాశారు. అదే ఏడాది డిసెంబర్ 27న కోల్‌కతాలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాలలో కూడా దానిని ఆలపించారు. 1912 జనవరి లో ఈ గీతాన్ని "తత్వ భోదిని" అనే పత్రిక "భారత విధాత" అనే పేరుతో ప్రచురించింది. తర్వాత కూడా జాతీయోద్యమం నేపథ్యంలో ఆ గీతాన్ని అనేక సార్లు, అనేక వేదికల మీద ఆలపించారు. అయితే ఇప్పుడు మనం వినే ట్యూన్‌లో కాకుండా, నిర్దిష్టమైన స్వర కల్పన లేకుండా, ఎవరికి నచ్చిన రాగంలో వాళ్ళు పాడుకునే వారు. భారత స్వాతంత్రోద్యమాన్ని బలపరిచిన డాక్టర్ అనీబిసెంట్ మదనపల్లెలో థియోసాఫికల్ కాలేజీని స్థాపించారు. ఐరిష్ జాతీయుడైన ప్రముఖ విద్యావేత్త జేమ్స్ హెన్రీ కజిన్స్ దాని ప్రిన్సిపాల్‌గా ఉండేవారు. లండన్ మ్యూజిక్ కాలేజిలో చదువుకున్న ఆయన భార్య మార్గరెట్ కజిన్స్ అక్కడ సంగీతాన్ని నేర్పించేవారు. 1919లో దక్షిణ భారతదేశ పర్యటనలో ఉన్న రవీంద్రనాథ్ ఠాగూర్ ఒకరోజు బెంగళూరు చేరుకున్నారు. మదనపల్లె వాతావరణం, జేమ్స్ కజిన్స్ కవిత్వం అంటే చాలా ఇష్టమైన ఠాగూర్, కజిన్స్ అక్కడే ఉన్న విషయం తెలుసుకుని, ఆయన విశ్రాంతి కోసం మదనపల్లెలోని థియోసాఫికల్ కాలేజీ చేరుకున్నారు. ఠాగూర్‌కు ప్రశాంత వాతావరణం కలిగిన థియోసాఫికల్ కాలేజీలో ప్రతి బుధవారం భోజనాల తర్వాత విద్యార్థులంతా కలిసి పాటలు పాడేవాళ్లు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఠాగూర్, ఒక కార్యక్రమంలో పాల్గొని, ఆ సందర్భంగా ఆయన స్వయంగా తన గొంతుకతో జనగణమన ఆలపించారు. ఠాగూర్ కంఠస్వరం నుంచి వెలువడిన ఆ పాటకు విద్యార్థులంతా గొంతు కలిపారు. మార్గరేట్ కజిన్స్ కూడా ఆ సమయంలో అక్కడే ఉండి, పాటలోని దేశభక్తిని, జాతీయ భావాన్ని గమనించారు. కానీ అప్పటికి జనగణమనను ఎవరికి వారే తోచిన రీతిలో పాడుకునే వారు. ఎవరూ రాగయుక్తంగా పాడ లేదు. కనుక దానిని తానే స్వరబద్ధం చేయాలని నిర్ణయించు కున్నారు. తెల్లవారి ఆమె ఠాగూర్‌ను కలిసి జనగణమనను స్వరబద్ధం చేయాలన్న తన కోరికను వెలిబుచ్చారు. దీనికి అంగీకరించిన ఠాగూర్, ఆమెకు ఆ పాట అర్థాన్ని వివరించారు. దానికి స్వరం ఎలా ఉంటే బాగుంటుందో సూచించారు. తర్వాత మార్గరేట్ కజిన్స్ తన విద్యార్థినుల సహాయంతో ప్రతి పదానికి అర్థం తెలుసుకుంటూ దానికి. బాణీ సమకూర్చారు. తర్వాత ఠాగూర్‌కు తాను కట్టిన స్వరాన్ని వినిపించారు. కొన్ని చిన్న చిన్న సంగీత పరికరాలతో విద్యార్థులు రాగయుక్తంగా పాడిన జనగణమన గీతాన్ని విన్న ఠాగూర్ ఆమెను ఎంతగానో అభినందించారు. బెంగాల్‌లో పుట్టిన జనగణమన గీతం మదనపల్లెలో స్వరాన్ని సమకూర్చు కున్నది. రవీంద్రనాథ్ ఠాగూర్ మదనపల్లెలో ఉన్న సమయంలోనే ఒక ఉదయాన థియోసాఫికల్ కాలేజీ ప్రాంగణం లోని చెట్టుకింద కూర్చుని జనగణమనను ఆంగ్లం లోనికి అనువదించారు కూడా. తర్వాత దానిని తన అందమైన చేతిరాతతో రాయడమే కాకుండా, కింది భాగంలో దాని పేరు 'మార్నింగ్ సాంగ్ ఆఫ్ ఇండియా' అని రాశారు. దాని కింద ఫిబ్రవరి 28, 1919 అని రాసి, సంతకం చేసి, మార్గరేట్ కజిన్స్‌కు బహుమానంగా ఇచ్చారు. మదనపల్లె కాలేజీ వదలివెళ్లే ముందు ఠాగూర్ దానిని 'దక్షిణ భారతదేశపు శాంతినికేతన్' అని కీర్తించారు. ఈ గీతానికి సంగీత బాణీ కూడా ముందుగా ఠాగూర్ సృష్టించారు. దేశభక్తి గేయమైన జనగణమన బాణీ కనుగుణంగా ఈ గీతాలాపన చేసేందుకు 52 సెకండ్లు పడుతుంది. అప్పుడప్పుడు మొదటి, చివరి పాదాలను మాత్రమే పాడే పద్ధతి కూడా ఉంది. దీనికి 20 సెకండ్లు పడుతుంది

1950 జనవరి 24 న జాతీయగీతంగా రాజ్యాంగ సభ స్వీకరించింది... 'జన గణ మన' ఇక నుంచీ మన కొత్త గణతంత్ర రాజ్యానికి జాతీయ గీతమనీ, దీన్ని అంతా గౌరవించి ఆదరించాలనీ 1950 జనవరి 24న రాజ్యాంగ సభ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ ఓ ప్రకటన చేశారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో మహోన్నత పాత్ర పోషించిన 'వందేమాతరం' గీతాన్ని కూడా జన గణ మనతో సమానంగా గౌరవించి ఆదరించాలి" అని ఆ రోజున రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. భారతదేశ రాజ్యాంగం ఆర్టికల్ 51ఏలో ఈ గీతాన్ని గౌరవించాలంటూ ప్రజలకు విజ్ఞప్తి చేసిన ప్రస్తావన కనిపిస్తుంది. "ప్రతి పౌరుడూ రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలి. జాతీయ పతాకం, జాతీయ గీతం వంటి రాజ్యాంగ ఆదర్శాలు, లక్ష్యాలు, సంస్థలను గౌరవించాలి" అని ఈ చట్టం పేర్కొంటున్నది. ప్రార్థనగా, కృతజ్ఞతగా పఠించే 52 సెకన్ల ఈ చిన్న గీతానికి ఉన్నంత గుర్తింపు , భారత దేశంలో, ప్రపంచంలో కూడా మరే గీతానికీ లేదు. మన జాతీయ గీతం దేశ సమైక్యతకు సరైన ప్రతీకగా నిలిచింది. జాతీయ గీతం, జాతీయ పతాకం పట్ల గౌరవం, ప్రేమాభిమానాలు ప్రదర్శించడమంటే మాతృభూమిని గౌరవించు కోవడమే అవుతుంది. ఇది ప్రతి ఒక్కరిలో దేశభక్తిని, జాతీయ భావాన్ని నింపడానికి ఉపకరిస్తుంది. జనగణమన పాడినప్పుడు దాని అర్థాన్ని కూడా ఒక్కసారి మననం చేసుకోవాలి. దాని నేపథ్యాన్ని, అర్థాన్ని, ప్రాధాన్యతను గుర్తించి, తర్వాత తరం వారికి చేర్చాల్సిన అవసరం అనివార్యంగా ఉంది

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ఈసారి హాకీ పోరు కొత్తగా!

- ప్రపంచకప్‌లో పూర్తిగా మారిన ఫార్మాట్
- క్వార్టర్ ఫైనల్స్‌కు స్వస్తి.. మూడంచెల విధానం
- 16 జట్లతో ఈ నెల 15 నుంచి మెగా సమరం
- 51 ఏళ్ల టైటిల్ నిరీక్షణకు తెరదించేందుకు భారత్ సిద్ధం



**న్యూఢిల్లీ, ఆగస్టు 12:** ప్రతిష్టాత్మక పురుషుల హాకీ ప్రపంచకప్ మరో మూడు రోజుల్లో ప్రారంభం కానుంది. 51 ఏళ్లుగా అందని ప్రపంచకప్ టైటిల్‌ను మరోసారి ముద్దాడాలనే లక్ష్యంతో భారత జట్టు బరిలోకి దిగుతోంది. నెదర్లాండ్స్, బెల్జియం సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీలో ఈసారి పోటీ విధానాన్ని పూర్తిగా మార్చడం ఆసక్తి రేపుతోంది. గత ప్రపంచకప్‌లలో ఉన్న సంప్రదాయ క్వార్టర్ ఫైనల్స్‌ను తొలగించి, మూడంచెల విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ నెల 15 నుంచి 30 వరకు జరిగే ప్రపంచకప్‌లో మొత్తం 16 జట్లు పాల్గొంటాయి. నాలుగేసి జట్ల చొప్పున వాటిని ఎ, బి, సి, డి గ్రూపులుగా విభజించారు. భారత్ గ్రూప్-డిలో ఇంగ్లండ్, పాకిస్థాన్, వేల్స్‌తో తలపడనుంది. ఈ నెల 15 నుంచి 20 వరకు తొలి దశ మ్యాచ్‌లు జరుగుతాయి. నాలుగు గ్రూపుల్లోని జట్లు తమ గ్రూపులోని మిగతా మూడు జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడతాయి. ప్రతి గ్రూపులో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు రెండో దశకు అర్హత సాధిస్తాయి. అయితే మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన జట్ల పోరు అక్కడితో ముగియదు. అవి కూడా తదుపరి వర్గీకరణ దశలో కొనసాగుతాయి.

### రెండో అంచె.. క్రాస్ ఓవర్ రౌండ్

ఈ నెల 21 నుంచి 24 వరకు రెండో దశ పోటీలు జరుగుతాయి. తొలి దశ ఫలితాల ఆధారంగా జట్లను ఈ, ఎఫ్, జీ, హెచ్ పూల్స్‌గా విభజిస్తారు.

**పూల్-ఈ:** గ్రూప్-ఎ, గ్రూప్-డిలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన నాలుగు జట్లు.

**పూల్-ఎఫ్:** గ్రూప్-బి, గ్రూప్-సిలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన నాలుగు జట్లు.

**పూల్-జీ:** గ్రూప్-ఎ, గ్రూప్-డిలో మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు.

**పూల్-హెచ్:** గ్రూప్-బి, గ్రూప్-సిలో మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు.

ఈ దశలో ప్రతి జట్టు తొలి రౌండ్‌లో ఎదుర్కొని ప్రత్యర్థులతో తలపడుతుంది. ఇక్కడ మరో కీలక నిబంధన ఉంది. తొలి దశ నుంచి ముందుకు వచ్చిన జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో సాధించిన పాయింట్లు రెండో దశకు కూడా కొనసాగుతాయి. ఉదాహరణకు గ్రూప్-డిలో భారత్ ఇంగ్లండ్‌ను ఓడించి, ఆ రెండు జట్లూ తొలి రెండు స్థానాల్లో నిలిచి పూల్-ఈకు చేరితే.. ఇంగ్లండ్‌పై భారత్ సాధించిన పాయింట్లు రెండో దశలోనూ లెక్కలోకి వస్తాయి. దీంతో ప్రతి గ్రూప్ మ్యాచ్ అత్యంత కీలకంగా మారనుంది.

### క్వార్టర్స్ లేవు.. నేరుగా సెమీస్

కొత్త ఫార్మాట్‌లో అత్యంత కీలకమైన మార్పు ఇదే. సంప్రదాయ క్వార్టర్ ఫైనల్స్ ఉండవు. రెండో దశలో పూల్-ఈ, పూల్-ఎఫ్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచే జట్లు నేరుగా సెమీ ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. మిగతా జట్లు ఐదు నుంచి 16వ స్థానాల కోసం వర్గీకరణ మ్యాచ్‌లు ఆడతాయి. ఈ నెల 27, 28 తేదీల్లో సెమీ ఫైనల్స్, వర్గీకరణ మ్యాచ్‌లు జరగనున్నాయి. పూల్-ఈలో అగ్రస్థానంలో నిలిచిన జట్టు పూల్-ఎఫ్‌లో రెండో స్థానంలో నిలిచిన జట్టుతో తలపడుతుంది. పూల్-ఎఫ్ అగ్రస్థాన జట్టు పూల్-ఈ రెండో స్థానంలోని జట్టుతో మరో సెమీఫైనల్లో పోటీపడుతుంది. ఆగస్టు 30న ప్రపంచకప్ ఫైనల్ జరగనుంది. సెమీ ఫైనల్స్‌లో విజయం సాధించిన రెండు జట్లు విశ్వవిజేతగా నిలిచేందుకు అమీతుమీ తేల్చుకోనున్నాయి. అంతకుముందు సెమీస్‌లో ఓడిన జట్ల మధ్య కాంస్య పతక పోరు జరుగుతుంది. భారత్ చివరిసారిగా 1975లో ప్రపంచకప్‌ను గెలుచుకుంది. అప్పటి నుంచి మరోసారి విశ్వవిజేతగా నిలవాలన్న కల నెరవేరలేదు. ఈసారి కొత్త ఫార్మాట్‌లో ప్రతి మ్యాచ్, ప్రతి పాయింట్ కీలకంగా మారనున్న నేపథ్యంలో.. 51 ఏళ్ల నిరీక్షణకు తెరదించి భారత జట్టు మళ్లీ ప్రపంచ హాకీ శిఖరాన్ని అధిరోహిస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

# భారత్-అఫ్గాన్ టీ20 షెడ్యూల్ విడుదల




భారత్, అఫ్గానిస్థాన్ క్రికెట్ జట్ల మధ్య మరో రసవత్తర సమరానికి రంగం సిద్ధమైంది. అఫ్గానిస్థాన్ హోస్ట్ చేసే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు ఢిల్లీలోని ప్రతిష్టాత్మక అరుణ్ జైట్లీ క్రికెట్ స్టేడియం ఆతిథ్యమివ్వనుందని అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు, బీసీసీఐ సంయుక్తంగా వెల్లడించాయి. సెప్టెంబర్ 13న తొలి టీ20, సెప్టెంబర్ 15న రెండో టీ20, సెప్టెంబర్ 17న మూడో టీ20 మ్యాచ్‌లు ఒకే వేదికపై జరగనున్నాయి. అఫ్గానిస్థాన్ తమ స్వదేశీ సిరీస్‌లను భారత్, యూఏఈలలో ఆడుతున్న నేపథ్యంలో, ఈ ద్వైపాక్షిక సిరీస్‌కు భారత్‌నే హోస్ట్ వేదికగా ఎంచుకుంది. అఫ్గానిస్థాన్‌లో క్రికెట్ అభివృద్ధికి బీసీసీఐ ఎల్లప్పుడూ సంపూర్ణ మద్దతు ఇస్తుందని బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ తెలిపారు. నాణ్యమైన ప్రత్యర్థి జట్లతో ద్వైపాక్షిక మ్యాచ్‌లు ఆడటం వల్ల అఫ్గాన్ ఆటగాళ్లకు అంతర్జాతీయ స్థాయిలో విలువైన అనుభవం లభిస్తుందని పేర్కొన్నారు. భారత అభిమానుల్లో అఫ్గాన్ ఆటగాళ్లకు ఉన్న ఆదరణ ఇరు దేశాల క్రికెట్ అనుబంధాన్ని మరింత బలోపేతం చేసిందని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా పేర్కొన్నారు. 2018లో అఫ్గాన్ తొలి చారిత్రక టెస్టుకు ఆతిథ్యమిచ్చిన భారత్, ఇటీవలే జూన్‌లో టెస్ట్, వన్డే సిరీస్‌లను నిర్వహించిన సంగతిని ఆయన గుర్తుచేశారు. ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు రోహన్ జైట్లీ ఈ సిరీస్ పట్ల హర్షం వ్యక్తం చేశారు. అరుణ్ జైట్లీ స్టేడియంలో ఇరు జట్లకు అత్యుత్తమ వసతులు కల్పిస్తామని, ఢిల్లీ క్రికెట్ అభిమానులకు ఈ మూడు టీ20 మ్యాచ్‌లు సరికొత్త వినోదాన్ని అందిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సిరీస్ అఫ్గానిస్థాన్ క్రికెట్‌కు ఎంతో కీలకమని ఏసీబీ చైర్మన్ మిర్వైస్ అష్రఫ్ పేర్కొన్నారు. బీసీసీఐతో ఉన్న దీర్ఘకాలిక సంబంధాల్లో ఇది మరో కీలక ముందడుగు అని, భారత్ వేదికగా ఈ సిరీస్ నిర్వహించడం ద్వారా వాణిజ్య, సాంకేతిక, క్రీడా రంగాల్లో తమకు ఎంతో లబ్ధి చేకూరుతుందని తెలిపారు. కాగా బీసీసీఐ, ఏసీబీ ప్రకటనతో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుకు షాక్ తగిలినట్లయింది. ఎందుకంటే ఆ దేశ క్రికెట్ బోర్డు.. తమతో సిరీస్ ఆడేందుకు భారత్.. బంగ్లాదేశ్ వస్తుందని ఆశలు పెట్టుకుంది. కానీ తాజా షెడ్యూల్ ప్రకటన చూస్తే.. బంగ్లాదేశ్ పర్యటనకు తాము వెళ్లడం లేదని బీసీసీఐ చెప్పేసినట్లయింది.

# సూర్యకుమార్ యాదవ్‌పై కన్నేసిన ఫ్రాంచైజీలు




టీమిండియా మాజీ టీ20 కెప్టెన్, ముంబై ఇండియన్స్ స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ ఆ జట్టును వీడనున్నాడనే వార్తలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. పేలవ ఫామ్‌తో టీమిండియా టీ20 కెప్టెన్సీతో పాటు జట్టులో చోటు కోల్పోయిన సూర్యను వదులుకునేందుకు ముంబై సిద్ధమైందని వార్తలు వచ్చాయి. అతన్ని లక్నో సూపర్ జెయింట్స్‌కు ట్రేడ్ చేసేందుకు ముంబై ప్రయత్నించినట్లు కూడా ప్రచారం జరిగింది. సూర్య నిష్క్రమణపై ఎలాంటి అధికారిక ప్రకటన లేకపోయినప్పటికీ.. అతను జట్టును వీడటం ఖాయమనిపిస్తోంది. ఐపీఎల్ 2026 సీజన్‌లో సూర్యకుమార్ యాదవ్ పేలవ ప్రదర్శన ముంబై ఇండియన్స్ విజయవకాశాలను దెబ్బతీసింది. 13 మ్యాచ్‌ల్లో సూర్య రెండు హాఫ్ సెంచరీలతో 270 పరుగులే చేశాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో 16 మ్యాచ్‌ల్లో 717 పరుగులు చేసిన సూర్య ఆ జోరును కొనసాగించలేకపోయాడు. అంతేకాకుండా గత ఏడాదిన్నరగా సూర్య.. అంతర్జాతీయ క్రికెట్‌లో కూడా విఫలమయ్యాడు. పేలవ ప్రదర్శనతో చివరకు కెప్టెన్సీతో పాటు జట్టులో చోటు కూడా కోల్పోయాడు. ఈ క్రమంలోనే అతన్ని వదులుకునేందుకు ముంబై ఇండియన్స్ సిద్ధమైందనే వాదన వినిపిస్తోంది. అయితే సూర్యను ముంబై వదిలేస్తే అతన్ని తీసుకునేందుకు మూడు ఫ్రాంచైజీలు రెడీగా ఉన్నాయి. సూర్యకుమార్ యాదవ్‌ను తీసుకునే ఫ్రాంచైజీల్లో కోల్‌కతా నైట్‌రైడర్స్ ముందు వరుసలో ఉంది. ప్రస్తుతం సూర్య ఫామ్‌లో లేకపోయినా అతని అనుభవం, టీ20 ఫార్మాట్‌కు సరిగ్గా సరిపోయే బ్యాటింగ్ శైలి జట్టుకు ఉపయోగపడుతుందని కేకేఆర్ భావిస్తోంది. అంతేకాకుండా కేకేఆర్‌కు కెప్టెన్ అవసరం ఉంది. సూర్యను తీసుకుంటే కెప్టెన్సీతో పాటు మిడిలార్డర్ బ్యాటర్ లోటును తీర్చుకోవచ్చని భావిస్తోంది. అవసరమైతే సూర్య కోసం ముంబైతో కేకేఆర్ ట్రేడ్ డీల్స్ జరపనుంది. వేలంలోకి వచ్చినా కోట్ల రూపయాలను కుమ్మరించనుంది. సూర్యకుమార్ యాదవ్ కోసం లక్నో సూపర్ జెయింట్స్ కూడా పోటీపడనుంది. అయితే అతని కోసం తమ స్టార్ ఆటగాళ్లను వదులుకునేందుకు లక్నో సిద్ధంగా లేదు. ఈ క్రమంలోనే ముంబైతో ట్రేడ్ డీల్‌కు నిరాకరించినట్లు తెలుస్తోంది. ఒకవేళ సూర్య వేలంలోకి వస్తే అతన్ని కొనుగోలు చేసే ప్రయత్నం చేయనుంది. ఎందుకంటే లక్నోకు కూడా కెప్టెన్సీతో పాటు ఓ ఇండియన్ మిడిలార్డర్ బ్యాటర్ అవసరం ఉంది. సూర్య కోసం రాజస్థాన్ రాయల్స్ కూడా పోటీ పడనుంది. అవసరమైతే ముంబై ఇండియన్స్‌తో ట్రేడ్ డీల్‌కు ప్రయత్నాలు కూడా చేయవచ్చు. సూర్య కోసం యశస్వి జైస్వాల్‌ను కూడా వదులుకునేందుకు రాజస్థాన్ రాయల్స్ సిద్ధంగా ఉంది. టాప్ క్లాస్ ఇండియన్ మిడిలార్డర్ బ్యాటర్ అవసరం ఆ జట్టుకు ఉంది. అంతకంటే అనుభవం కలిగిన సారథి ఆ జట్టుకు కావాలి. సూర్య రాకతో ఈ రెండు సమస్యలను అధిగమించవచ్చని రాజస్థాన్ రాయల్స్ భావిస్తోంది.



# పదేళ్ల ప్రేమకు పెళ్లి ముద్ర

- జార్జినా రోడ్రిగేజ్‌ను వివాహమాడిన ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో
- పోర్చుగల్‌లోని కాస్కైస్‌లో నిరాడంబరంగా వివాహ వేడుక
- ఉంగరాలు మార్చుకుని అధికారికంగా ఒక్కటైన ప్రేమజంట
- వేడుకలో రొనాల్డో ఐదుగురు పిల్లల సందడి

**లిస్బన్, ఆగస్టు 12:** పోర్చుగల్ ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో ఓ ఇంటివాడయ్యాడు. దాదాపు పదేళ్లుగా తనతో కలిసి జీవిస్తున్న ప్రేయసి జార్జినా రోడ్రిగేజ్‌ను వివాహం చేసుకున్నాడు. పోర్చుగల్ రాజధాని లిస్బన్‌కు సమీపంలోని సముద్రతీర పట్టణం కాస్కైస్‌లో మంగళవారం వీరి వివాహం నిరాడంబరంగా జరిగింది. దీంతో సుదీర్ఘకాలంగా ప్రేమబంధంలో ఉన్న రొనాల్డో, జార్జినా అధికారికంగా భార్యాభర్తలయ్యారు. అత్యంత సన్నిహితుల మధ్య జరిగిన ఈ వివాహ వేడుకకు రొనాల్డో ఐదుగురు పిల్లలు కూడా హాజరయ్యారు. వివాహం అనంతరం రొనాల్డో, జార్జినా తమ ఉంగరాలను చూపిస్తూ తీసుకున్న చిత్రాన్ని సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడంతో అభిమానుల్లో ఆనందం వెల్లివిరిసింది. ప్రపంచవ్యాప్తంగా అభిమానులు కొత్త దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. రొనాల్డో, జార్జినా ప్రేమకథ 2016లో స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో మొదలైంది. అక్కడి ఓ గూచీ దుకాణంలో పనిచేస్తున్న సమయంలో జార్జినాకు రొనాల్డో పరిచయమయ్యాడు. ఆ పరిచయం ప్రేమగా మారి దాదాపు పదేళ్లుగా ఇద్దరూ కలిసి జీవిస్తున్నారు. 2025 ఆగస్టు 11న తమ నిశ్చితార్థాన్ని ప్రకటించిన ఈ జంట.. సరిగ్గా ఏడాది తర్వాత 2026 ఆగస్టు 11న వివాహబంధంతో ఒక్కటైంది. 41 ఏళ్ల రొనాల్డో ప్రపంచ ఫుట్‌బాల్ చరిత్రలో అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకడిగా గుర్తింపు పొందాడు. ఐదుసార్లు ప్రతిష్ఠాత్మక బాలన్ డి'ఓర్ పురస్కారాన్ని అందుకున్న అతడు.. సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో రికార్డులను తన పేరిట లిఖించుకున్నాడు. మైదానంలో రికార్డులతో ప్రపంచాన్ని అలరించిన రొనాల్డో.. ఇప్పుడు పదేళ్ల ప్రేమబంధానికి పెళ్లి ముద్ర వేసి జీవితంలో మరో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాడు.



# టీటీ చాంపియన్‌గా రిద్ధి

- సీబీఎస్ఈ క్లస్టర్-7 పోటీల్లో తెలంగాణ ప్యాడ్లర్ సత్తా
- అండర్-14 బాలికల సింగిల్స్‌లో టైటిల్ కైవసం

**హైదరాబాద్:** సీబీఎస్ఈ క్లస్టర్-7 టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ క్రీడాకారిణి రిద్ధి తోరో సత్తా చాటింది. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరులో జరిగిన ఈ పోటీల్లో అండర్-14 బాలికల సింగిల్స్ విభాగంలో అద్భుత ప్రతిభ కనబరిచి చాంపియన్‌గా అవతరించింది. బండ్లగూడ జాగీర్‌లోని టైమ్స్ స్కూల్‌కు చెందిన రిద్ధి ఫైనల్లో విజయవాడకు చెందిన హేత్వికపై 3-1 తేడాతో విజయం సాధించింది. తొలి గేమ్‌ను 7-11తో కోల్పోయిన రిద్ధి ఆ తర్వాత అద్భుతంగా పుంజుకుంది. వరుసగా 11-9, 11-8, 11-5తో మూడు గేమ్‌లను సొంతం చేసుకుని టైటిల్‌ను కైవసం చేసుకుంది. బాలికల అండర్-14 టీమ్ విభాగంలోనూ రిద్ధి ప్రతిభ కనబరిచింది. రిద్ధి తోరో, వంశిక, అనన్యతో కూడిన టైమ్స్ స్కూల్ జట్టు రన్నరప్‌గా నిలిచింది.

## ఇరుముడిలో .. ఇరగదీసిన రవితేజ

మాస్ మహారాజా రవితేజ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా సినిమా ఇరుముడి. ప్రియా భవాని శంకర్, సాయి కుమార్ ప్రత్యేక పాత్రలలో కనిపించనున్న ఈ ఇరుముడి సినిమాకు శివ నిర్వాణ దర్శకత్వం వహించారు. జీవి ప్రకాశ్ సంగీత స్వరాలు సమకూర్చారు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో వచ్చిన ఈ సినిమా ట్రైలర్ తాజాగా రిలీజ్ అయింది. ఇందులో తండ్రి సెంటిమెంట్, రవితేజ డైలాగ్స్ అదిరిపోయాయి. రవితేజతో పాటు కూతురు పాత్ర చేసిన బేబీ నక్షత్ర కూడా అదరగొట్టింది. ఇక ఈ ట్రైలర్ లో జీవి ప్రకాశ్ బీజీఎం ఇరగదీశారు. తాజాగా విడుదలైన ఈ ట్రైలర్, ఇరుముడి సినిమాకు హైప్ తీసుకువచ్చింది. మరి థియేటర్లలో జనాలను ఏ మాత్రం ఆకట్టుకుంటుందో చూడాలి. భక్తి నేపథ్యంలో వస్తున్న ఈ సినిమా ఈనెల 21వ తేదీన థియేటర్స్ లలో విడుదల కానుంది.





### టాక్సిక్ రిలేషన్‌షిప్‌పై ఓపెన్ అయిన

## అనుపమ పరమేశ్వరన్

దక్షిణాది చిత్ర పరిశ్రమను దున్నేస్తున్న యంగ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. మలయాళ చిత్రం ప్రేమమ్ సినిమాతో 2015 లోనే కెరీర్ ప్రారంభించిన అనుపమ, అ,ఆ సినిమాతో తెలుగులో కూడా సందడి చేశారు. ఆ తర్వాత శతమానం భవతి, రాక్షసుడు, కార్తికేయ 2, టిల్లు స్క్వేర్ లాంటి సినిమాలు చేసి టాలీవుడ్ ఇండస్ట్రీలో కూడా మంచి హిట్లు అందుకున్నారు. అయితే అలాంటి హీరోయిన్ అనుపమ, తాజాగా తన రిలేషన్ గురించి షాకింగ్ కామెంట్స్ చేశారు. తాను రిలేషన్ లో ఉన్న వ్యక్తి నుంచి తీవ్ర వేధింపులు ఎదుర్కొన్నానని ఆమె ఎమోషనల్ అయ్యారు. రెండు సంవత్సరాలు మానసిక హింసను భరించానని వెల్లడించారు. రిలేషన్ ప్రారంభంలో అందరూ ఎంతో ప్రేమ చూపిస్తారన్నారు. తను దొరకడం లక్కీ అనే భావన కూడా తెస్తారని.. తర్వాత అపరిచితుడు బయటకు వస్తారంటూ షాకింగ్ వ్యాఖ్యలు చేశారు. అదొక టాక్సిక్ రిలేషన్ అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. డ్రాగన్ మూవీని ప్రమోట్ కూడా చేయనివ్వలేదని ఆమె సీరియస్ అయ్యారు. ఆ రిలేషన్ వల్ల తాను చాలా కృంగిపోయానని వాపోయారు అనుపమ. తన రిలేషన్ గురించి షాకింగ్ నిజాలు పంచుకున్న అనుపమ.. అతని పేరు మాత్రం బహిర్గతం చేయలేదు. ఇది ఇలా ఉండగా తమిళ నటుడు ధృవ్ విక్రమ్ తో అనుపమ రిలేషన్ లో ఉన్నట్లు చాలా రోజుల నుంచి వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే.



## వంశీ పైడిపల్లి , సల్మాన్ మూవీలో బాలీవుడ్ బ్యూటీ!

సల్మాన్ ఖాన్, లేడీ సూపర్ స్టార్ నయనతార జంటగా ఓ భారీ ప్రాజెక్ట్ చేస్తున్నారు. వంశీ పైడిపల్లి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత దిల్ రాజు నిర్మిస్తున్నారు. సల్మాన్ ఖాన్, వంశీ పైడిపల్లి కాంబోలో వస్తున్న మొదటి సినిమా ఇది. అలాగే సల్మాన్ నయనతార జంటగా నటిస్తున్న తొలి చిత్రం కూడా ఇదే కావడం విశేషం. 'SVC63' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ ముంబైలో శరవేగంగా జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో భారీ యాక్షన్ సీన్లను చిత్రీకరిస్తున్నారు. ఈనేపథ్యంలో.. తాజాగా, ఈ సినిమాకు సంబంధించి ఒక ఆసక్తికరమైన అప్‌డేట్ బయటకు వచ్చింది.

'చక్ దే ఇండియా' సినిమాలో ప్రీతి సభర్వాల్ పాత్ర ద్వారా విశేష ఆదరణ పొందిన ప్రముఖ నటి సాగరిక ఘాట్గే ఈ సినిమాలో కీలక పాత్ర పోషించడానికి ఎంపికయ్యారని సమాచారం. అంతేకాకుండా ముంబై షూటింగ్‌లోనూ పాల్గొనబోతున్నట్లు టాక్. ఈ సినిమా ఈ సినిమాలో ఇప్పటికే బాలీవుడ్ నటులు రాహుల్ దేవ్, జాకీ ష్రాఫ్ నటిస్తుండగా, ఇప్పుడు సాగరిక కూడా వారి జట్టులో చేరారు. అయితే ఆమె ఇందులో ఎలాంటి పాత్ర చేస్తుందో అనే విషయాన్ని నిర్మాతలు ఇంకా రహస్యంగానే ఉంచారు. చాలా కాలం తర్వాత సాగరిక ఒక పెద్ద సినిమాలో కనిపిస్తుండటంతో ఆమె అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పూర్తిస్థాయి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ సినిమాని వచ్చే ఏడాది ఈద్ కానుకగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

## దుల్కర్ సల్మాన్ 'ఐ యామ్ గేమ్'కు బ్రేక్?

మాలీవుడ్‌లో దుల్కర్ సల్మాన్ సినిమాలకు ఉండే క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఆయన నుంచి సినిమా వస్తుందంటే కేరళతో పాటు ఇతర భాషల ప్రేక్షకుల్లోనూ ఆసక్తి మొదలవుతుంది. ఇప్పుడు అలాంటి అంచనాలతో వస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'ఐ యామ్ గేమ్' రిలీజ్ కు ముందే టెన్షన్ పెడుతోంది. ఆగస్టు 20న థియేటర్లలోకి రావాల్సిన ఈ సినిమా అనుకున్న తేదీకే వస్తుందా? లేక చివరి నిమిషంలో వాయిదా పడుతుందా అనే సస్పెన్స్ ను క్రియేట్ చేస్తోంది. నహాస్ హిదాయత్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఐ యామ్ గేమ్'పై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి బజ్ ని క్రియేట్ చేసింది. యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమాలో దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. సినిమా కథకు సంబంధించిన పూర్తి వివరాలను చిత్ర బృందం పెద్దగా రివీల్ చేయకుండా సస్పెన్స్ ను కొనసాగిస్తోంది. 2026ఆగస్టు 20న ఈ చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేయాలని మేకర్స్ నిర్ణయించారు.

అయితే ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనుల విషయంలో కొంత జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ కారణంగా అనుకున్న డేట్ కి సినిమా రిలీజ్ కావడం కష్టమయ్యే అవకాశముందని ప్రచారం మొదలైంది. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి ఇప్పటివరకు ఆఫీషియల్ గా ఏ ప్రకటన కూడా రాలేదు. దీంతో 'ఐ యామ్ గేమ్' రిలీజ్ డేట్ కి వస్తుందా ? వాయిదా పడుతుందా అన్నది సస్పెన్స్ గానే ఉంది. ఒకవేళ సినిమా నిజంగానే ఆగస్టు 20 నుంచి వాయిదా పడితే, అదే రోజున థియేటర్లలోకి రావాల్సిన పృథ్వీరాజ్ సుకుమారన్ 'ఖలీఫా'కు ఇది అనుకూలంగా మారే అవకాశం ఉంది. 'ఐ యామ్ గేమ్' తప్పుకుంటే 'ఖలీఫా' ఆ తేదీన సోలో రిలీజ్‌గా నిలిచే అవకాశం ఉంటుంది. అదే సమయంలో మమితా బైజు నటించిన 'బెత్లెహెం కుటుంబ యూనిట్'కు కూడా పోటీ కొంత తగ్గుతుంది. దీంతో ఈ రిలీజ్ డేట్ చుట్టూ మాలీవుడ్‌లో ఆసక్తికరమైన పరిస్థితి ఏర్పడింది.

'ఐ యామ్ గేమ్'లో దుల్కర్ సల్మాన్‌తో పాటు కయాదు లోహర్, ఆంటోనీ వర్గీస్, మిస్కిన్, కతిర్, సంయుక్త విశ్వనాథన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ కాంబినేషన్ కూడా సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. నహాస్ హిదాయత్ దర్శకత్వం కావడం, యాక్షన్ థ్రిల్లర్ జానర్ కావడం దుల్కర్ అభిమానుల్లో అంచనాలను మరింత పెంచుతున్నాయి. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే 'ఐ యామ్ గేమ్' మలయాళ ప్రేక్షకులకే పరిమితం కాకుండా తెలుగులో కూడా విడుదల కానుంది. దుల్కర్ సల్మాన్‌కు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ రిలీజ్ కు ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ప్రస్తుతం అందరి దృష్టి మాత్రం ఆగస్టు 20 తేదీపైనే ఉంది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు సమయానికి పూర్తయితే సినిమా అనుకున్న తేదీకే రావచ్చు. లేదంటే కొత్త రిలీజ్ డేట్ ను ప్రకటించే అవకాశం ఉంది. ఆఫీషియల్ అనౌన్స్మెంట్ వచ్చే వరకు ఈ సస్పెన్స్ కొనసాగేలా కనిపిస్తోంది.

## మలయాళంలోకి రుక్మిణీ వసంత్

కన్నడ సినీ పరిశ్రమ నుంచి వచ్చి, సౌత్ ఇండియా మొత్తాన్ని తన నటనతో, క్యూట్ లుక్స్‌తో ఆకట్టుకుంటోంది రుక్మిణీ వసంత్. ఇప్పటికే కన్నడ, తమిళం, హిందీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ఈ భామ ఇప్పుడు మలయాళ చిత్రసీమలోకి అడుగుపెడుతోంది. మలయాళ స్టార్ హీరో నివిన్ పాలీ సరసన కథానాయికగా రుక్మిణి ఎంపికైంది. 'జయ జయ జయ జయ హే' వంటి సెన్సేషనల్ హిట్‌ను అందించిన దర్శకుడు నషిద్ ఫామి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఒక్క మలయాళం మాత్రమే కాదు ప్రస్తుతం సౌత్ లోని బడా ప్రాజెక్టులన్నీ రుక్మిణీ వసంత్ డైరీలోనే ఉన్నాయి. రాకింగ్ స్టార్ యశ్ హీరోగా తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్ఠాత్మక పాన్ఇండియా చిత్రం 'టాక్సిక్' లో రుక్మిణి కీలక పాత్ర పోషిస్తోంది. దీనికి తోడు టాలీవుడ్‌లో యంగ్ టైగర్ ఎన్టీఆర్, సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తున్న 'డ్రాగన్' మూవీలోనూ రుక్మిణి కథానాయికగా నటిస్తోంది. ఈ బ్యాక్‌టుబ్యాక్ పాన్ ఇండియా ప్రాజెక్టులతో రుక్మిణీ వసంత్ రేంజ్ ఒక్కసారిగా మారిపోయింది. ఇదిలా ఉంటే ఇప్పుడు టాలీవుడ్ వర్గాల్లో మరో మైండ్ బ్లోయింగ్ న్యూస్ హల్‌చల్ చేస్తోంది. రామ్ చరణ్, డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో వస్తోన్న మోస్ట్ క్రేజీ ప్రాజెక్ట్ RC1లో కథానాయికగా రుక్మిణీ వసంత్ పేరును పరిశీలిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఒకవేళ ఇది గనుక అధికారికంగా ఖరారైతే రామ్ చరణ్ - రుక్మిణీల ఫస్ట్ కాంబినేషన్‌గా ఇది సరికొత్త రికార్డులను క్రియేట్ చేయడం ఖాయం. భాషతో సంబంధం లేకుండా లక్కీ చార్మ్‌గా మారిన రుక్మిణీ వసంత్... రాబోయే రోజుల్లో సౌత్ లేడీ సూపర్ స్టార్‌గా నిలిచినా ఆశ్చర్యం లేదంటున్నారు సినీ విశ్లేషకులు.





## జూనియర్ ఎన్టీఆర్‌కు సర్జరీ

మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ (Jr NTR) శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయినట్లు తాజా సమాచారం వెలువడింది. వైద్యుల పర్యవేక్షణలో తగిన విశ్రాంతి తీసుకుంటున్న తారక్, త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుంటారని వైద్య వర్గాలు తెలిపాయి. అభిమానులు, సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటూ సందేశాలు పోస్ట్ చేస్తున్నారు. శస్త్రచికిత్స అనంతరం తగిన రికవరీ పీరియడ్ తర్వాత, తారక్ ఈ ఏడాది సెప్టెంబర్ నెల నుండి తన మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ 'డ్రాగన్' షూటింగ్‌లో తిరిగి పాల్గొననున్నారు. ప్రశాంత్ నీల్, ఎన్టీఆర్ కాంబినేషన్ మీద భారీ అంచనాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రం సెట్స్ పైకి తిరిగి వెళ్లేందుకు సన్నాహాలు శరవేగంగా జరుగుతున్నాయి. గత నెల 27న జూనియర్ ఎన్టీఆర్ భుజంకి గాయమైనట్టు ఆయన ఆఫీస్ ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఇక ఇప్పుడు ఈరోజు కిమ్స్ లోని స్పెషలిస్ట్ డాక్టర్స్ టీం ఈ సర్జరీ విజయవంతంగా పూర్తి చేసింది.

**నేను క్షేమంగా ఉన్నా : ఎన్టీఆర్**

సర్జరీ విజయవంతం అయిన నేపథ్యంలో జూనియర్ ఎన్టీఆర్ ట్వీట్ చేశారు. తాను క్షేమంగానే ఉన్నానంటూ ప్రకటించారు. ఎవరు ఆందోళన చెందాల్సిన పనిలేదని పేర్కొన్నారు సర్జరీ పూర్తయిన తర్వాత ఆయన ఆరోగ్యంగా ఉన్నారని హెల్త్ బులిటెన్ కూడా కిమ్స్ వైద్యులు విడుదల చేశారు. ఈ క్రమంలో తన సర్జరీపై స్వయంగా జూనియర్ ఎన్టీఆర్ స్పందించారు. మీ అందరి నుంచి వెల్లువెత్తిన ప్రేమ, ప్రార్థనలు తనను ముంచెత్తాయి అంటూ వెల్లడించారు. సర్జరీ విజయవంతమైందని పేర్కొన్నారు. తాను క్షేమంగా ఉన్నానని.. ఎవరు భయపడాల్సిన అవసరం లేదని క్లారిటీ ఇచ్చారు ఎన్టీఆర్. కిమ్స్ వైద్య బృందానికి తన హృదయపూర్వక ధన్యవాదాలు అంటూ ఎమోషనల్ అయ్యారు. స్నేహితులు, కుటుంబం, ఫ్యాన్స్ మద్దతు తనకు ప్రతిరోజు బలాన్ని ఇస్తుందని...త్వరలో కలుద్దాం అంటూ పోస్ట్ పెట్టారు. ఇక ఎన్టీఆర్ ట్వీట్ చేసిన నేపథ్యంలో ఆయన ఫ్యాన్స్ రియాక్ట్ అవుతున్నారు. అన్నా నువ్వు త్వరగా కోలుకోవాలి..నీ కోసం ఎంతో ఎదురు చూస్తున్నాం అంటూ కామెంట్స్ చేస్తున్నారు.

Printed, Published and Owned by V SAMPATH, and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146 Email: shenarthimedia@gmail.com. Phone No: 9391343644